విశాఖపట్టణం
బుధవారం 12 ఆగస్టు 2026

For a pure tomorrow..

# జయ జయహే


epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక: 200 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

## విశాఖకు జాతీయ విపత్తు నిధి

**రెండోదశలో ఎంపికలో విశాఖ.. రూ.222.22 కోట్లు కేటాయింపు**

(ప్రత్యేక ప్రతినిది - జయజయహే)




జాతీయ విపత్తు నివారణ నిధి కింద మొత్తం 18 నగరాలను కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసినట్లు కేంద్ర హోం శాఖ తెలిపింది. 18 నగరాలకు ఆర్థికసాయం చేసేందుకు ఏకంగా రూ.5,520.07 కోట్లను ప్రభుత్వం ఆమోదించిందని వెల్లడించింది. ఈ నిధులతో ఆయా నగరాల్లో విపత్తు నివారణ కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొంది. అయితే, రెండు దశల్లో ఈ నగరాలను ఎంపిక చేసినట్లు హోంశాఖ చెప్పింది. ఈ మేరకు పార్లమెంట్‌లో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అడిగిన ప్రశ్నకు కేంద్ర ..మిగతా 2లో

# ప్రజలపై భారం పడరాదు

**15 శాతం వృద్ధిరేటు లక్ష్యం**


**మండలాల వారీ ముందస్తు ప్రణాళిక**

**వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధర**

**సీఎం చంద్రబాబు ఆదేశాలు**

**2026 ఆర్థిక నివేదిక వెల్లడి**





(అమరావతి - జయజయహే)

సూపర్ ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ, ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ సానుకూల ప్రగతి సాధించడంపై సీఎం నారా చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో 15 శాతం వృద్ధిరేటు సాధించడమే లక్ష్యంగా సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని, అదే సమయంలో సామాన్య ప్రజలపై నిత్యావసర ధరల భారం పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రణాళికా విభాగం సమర్పించిన 2026 జులై ఆర్థిక నివేదికను సీఎం చంద్రబాబు పరిశీలించారు. అన్ని ప్రభుత్వ శాఖలు తమ వనరులను సమర్థవంతంగా నిర్వహించి నిర్ణీత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. నీటి లభ్యతను పెంచడం, వ్యవసాయ ఉత్పత్తులకు అధిక విలువ కల్పించడంపై జిల్లా, నియోజకవర్గం, మండలాల వారీగా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

**రెండో త్రైమాసికంలో 10.7 శాతం వృద్ధిరేటు**

ప్రణాళికా విభాగ నివేదిక ప్రకారం, 2025-26 రెండో త్రైమాసికంలో ఆంధ్రప్రదేశ్ 10.7 శాతం వృద్ధిరేటు సాధించింది. వాస్తవ వృద్ధిరేటులో 9.9 శాతంతో గత 2 ఏళ్లుగా జాతీయ సగటు కంటే మెరుగైన స్థితిని నమోదు చేసింది. రంగాల వారీగా రిపోర్ట్ పరిశీలిస్తే.. ..మిగతా 2లో



## 158 గ్రామాలకు తొలిసారి రోడ్లు

**చిట్టచివర గ్రామానికి రహదారి**

**గ్రామీణ సడక్ యోజనలో రూ. 422.10 కోట్లు నిధులు**

**డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాలు**

అమరావతి - జయజయహే)

రాష్ట్రంలోని చిట్టచివరి గ్రామానికి సైతం రోడ్డు సౌకర్యం కల్పించేలా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. ఈ మేరకు గ్రామీణ రహదారుల నిర్మాణంపై పంచాయతీరాజ్ శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే అడవితల్లి బాట పేరిట అల్లూరి సీతారామరాజు జిల్లా, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని ఎన్నో గిరిజన గ్రామాలకు తొలిసారి రహదారి సౌకర్యం కల్పించారు. ఇప్పుడు మైదాన ప్రాంతాల్లో మారుమూల పల్లెలు, ఆవాసాలకు, కుగ్రామాలకు రోడ్లు వేసేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. 158 మారుమూల గ్రామాలకు అనుసంధాన రహదారులు నిర్మించేందుకు పరిపాలన అనుమతులిచ్చారు. 347 కిలోమీటర్ల పొడవున, 146 రోడ్లు, 19 వంతెనల ..మిగతా 2లో

# మరిన్ని అగ్రిగోల్డ్ ఆస్తుల జప్తు




**బంధువుల పేరిట అసెట్స్ సీజ్**

**6వేల ఎకరాల భూమి వేలానికి సిద్ధం**

**ప్రభుత్వం ఉక్కుపాదం**

(అమరావతి - జయజయహే)

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేగవంతం చేసింది. డిపాజిటర్లను నిలువునా ముంచిన అగ్రిగోల్డ్ యాజమాన్యంపై ఉక్కుపాదం మోపుతోంది. ఇటీవలే అగ్రిగోల్డ్‌కు చెందిన 6,000 ఎకరాలకు పైగా భూములను వెంటనే వేలం వేయాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. తాజాగా కేసు విచారణలో భాగంగా తాజాగా బంధువుల పేరిట అక్రమంగా కొనుగోలు చేసిన ఆస్తులను జప్తు చేయాలని హోం శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అగ్రిగోల్డ్ యాజమాన్యం డిపాజిటర్ల సొమ్మును దారి మళ్లించినట్లు విచారణలో తేలింది. ప్రజల నుంచి వసూలు చేసిన డబ్బులతో బంధువుల పేరిట ఆస్తులు కొనుగోలు చేసినట్లు సీఐడీ గుర్తించింది. ఈ అక్రమ ఆస్తులపై ప్రభుత్వం కొరడా ఝుళిపించింది. వాటిని వెంటనే జప్తు చేయాలని తాజాగా హోం శాఖ ఉత్తర్వులు ఇచ్చింది. అగ్రిగోల్డ్ కంపెనీలకు జాయింట్ ఎండీగా వ్యవహరించిన అవ్వా హేమ సుందర వరప్రసాద్ అత్త ఎల్లా జయలక్ష్మి పేరిట భూములు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. కృష్ణా జిల్లాలోని పోరంకి, పెనమలూరు, ఈదర ..మిగతా 2లో



## నేడు వైసీపీ శాసనసభపక్ష భేటీ

**అసెంబ్లీపై జగన్ దిశానిర్దేశం**

**భవిష్యత్తు కార్యాచరణపై ప్రణాళిక**

(తాడేపల్లి - జయజయహే)

తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో రేపు ఉదయం 10:30 గంటలకు పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధ్యక్షతన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల అత్యవసర భేటీ జరగనుంది. ఈ సమావేశంలో రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రజాప్రతినిధులతో వైఎస్ జగన్ సుదీర్ఘంగా చర్చించనున్నారు. ముఖ్యంగా రాబోయే అసెంబ్లీ సమావేశాలకు హాజరుకావడంపై ఈ భేటీలో కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. దీనితో పాటు పార్టీ చేపట్టాల్సిన తదుపరి కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణపై నేతలకు వైఎస్ జగన్ కీలక దిశానిర్దేశం చేయనున్నారు. తాడేపల్లిలో జరగనున్న ఈ సమావేశం రాష్ట్ర రాజకీయ వర్గాల్లో తీవ్ర ఆసక్తిని రేపుతోంది.



## ఫాస్ట్ ట్రాక్ కోర్టు..!

**మెడికో ప్రియాంక కేసు విచారణకు పరిశీలన**

**ఎక్కడా పోలీసు వైఫల్యం లేదు**

**నిందితులకు కఠిన శిక్షలు పడేలా చర్యలు**

**తల్లితండ్రులకు కూటమి ప్రభుత్వం హామీ**

(రాజమహేంద్రవరం - జయజయహే)

రాజమహేంద్రవరంలో వైద్య విద్యార్థిని ప్రియాంకను కారుతో ఢీ కొట్టి చంపిన కేసులో నిందితులకు కఠిన శిక్ష పడేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తూర్పుగోదావరి జిల్లాలోని కూటమి ఎమ్మెల్యేలు స్పష్టం చేశారు. హత్యతో సమానమైన సెక్షన్లు నమోదు చేసి నిందితులపై కఠినంగా శిక్షపడేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. కేసు దర్యాప్తుపై ఎక్కడా అనుమానించాల్సిన అవసరం లేదని, బాధిత కుటుంబానికి తాము అండగా ఉంటామని ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, బుచ్చయ్య చౌదరి, నల్లమిల్లి ..మిగతా 2లో

## తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్‌కు మహిళలే డ్రైవర్లు

**మహిళ, నవజాత శిశువులకు ఆరోగ్య భద్రత**

**మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి.. 300 వాహనాలు ప్రారంభం**




(పల్నాడు - జయజయహే)

రాష్ట్రంలో గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువుల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోంది. ఇందులో భాగంగా తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల్లో ఇకపై మహిళా డ్రైవర్లనే నియమించనున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలోని ఏరియా ఆసుపత్రి ప్రాంగణంలో అత్యాధునిక సౌకర్యాలతో రూపొందించిన 300 కొత్త తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల విభాగాన్ని ఆయన అధికారికంగా జెండా ఊపి ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, ..మిగతా 2లో

## ఆక్వా రైతులకు విద్యుత్ రాయితీ

**యూనిట్‌కు రూ. 1.50పైసలకే ప్రకటించిన ప్రభుత్వం**

2



## వందేమాతరం బిల్లుకు ఆమోదం

**జాతీయ గీతానికి చట్టపరమైన రక్షణ**

**కేంద్ర ప్రభుత్వం ప్రకటన**

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మంగళవారం నాడు వందేమాతరం సవరణ బిల్లుకు ఆమోదం తెలిపారు. దీని ప్రకారం జాతీయ గేయం 'వందేమాతరం' ఆలపించడాన్ని ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవడం లేదా నిరోధించడం నేరంగా పరిగణిస్తారు. ప్రస్తుతం జాతీయ గీతానికి ఉన్న చట్టపరమైన రక్షణే దీనికి ..మిగతా 2లో

# వెలంపేటకు మహర్దశ

**రీడెవలప్‌మెంట్‌కు ప్రభుత్వ అనుమతి**

**45 మీటర్ల ఎత్తులో 177 ఆధునిక ఫ్లాట్స్**

**1:4 నిష్పత్తిన ప్రైవేటుకు టీడీఆర్**

**వీఈఆర్ లో భాగంగా పైలెట్ ప్రాజెక్టు**

**(విశాఖపట్నం - జయజయహే)**



ప్రభుత్వం పట్టణాల్లోని ఇరుకైన, మురికివాడల రూపురేఖలను మార్చేందుకు ఒక సరికొత్త రీడెవలప్‌మెంట్ నమూనాకు ఆమోదం తెలిపింది. ముంబైలోని ప్రసిద్ధ ధారావి మోడల్ ఆధారంగా ఈ భారీ పట్టణ పునర్నిర్మాణ ప్రాజెక్టును మొదటగా విశాఖపట్నంలోని వెలంపేట మురికివాడలో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేయాలని నిర్ణయించింది. ఒక అధికారిక ప్రకటనలో ప్రభుత్వం ఈ వివరాలను వెల్లడించింది. ప్రభుత్వ ఖజానాపై నేరుగా ఎలాంటి ఆర్థిక భారం పడకుండా, అక్కడే నివసిస్తున్న పేద ప్రజలకు ఆధునిక వసతులతో కూడిన ఇళ్లను నిర్మించి ఇవ్వడమే ఈ నమూనా ముఖ్య ఉద్దేశం. విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్ కార్యక్రమంలో భాగంగా జోన్-×ం, వార్డు నంబర్ 35 పరిధిలోని వేలం పేట స్లమ్‌ను డిజైన్, బిల్డ్, ఫైనాన్స్, ట్రాన్స్‌ఫర్ ప్రాతిపదికన అభివృద్ధి చేయడానికి గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ కి ప్రభుత్వం పూర్తి అనుమతులు మంజూరు చేసింది. కేవలం 1,986.45 చదరపు మీటర్ల చిన్న స్థలంలో ఈ నిర్మాణాన్ని చేపడుతున్నారు. దాదాపు 45 మీటర్ల ఎత్తు వరకు ఎత్తైన అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌ను నిర్మిస్తారు. ఈ కాంప్లెక్స్‌లో స్థానిక నివాసితుల కోసం 177 అధునాతన హౌసింగ్ యూనిట్లను కేటాయిస్తారు. ఈ ప్రాజెక్టుకు సంప్రదాయ ప్రభుత్వ నిధులపై ఆధారపడకుండా, ప్రైవేట్ డెవలపర్లను ఆకర్షించేందుకు 'ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్' విధానాన్ని కీలకమైన అంశంగా చేర్చారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం గరిష్టంగా 1:4 నిష్పత్తి వరకు టీడీఆర్ నిష్పత్తిని బిడ్డింగ్ పారామిటర్‌గా అనుమతించారు. పోటీతత్వ టెండర్ విధానం ద్వారా తక్కువ టీడీఆర్ ప్రతిపాదించే ప్రైవేట్ సంస్థకు ఈ ప్రాజెక్టు కాంట్రాక్టును అప్పగిస్తారు. నిర్మాణ వ్యయానికి పరిహారంగా ఈ టీడీఆర్ హక్కులను పొందే డెవలపర్, పట్టణంలోని విలువైన భూమిని మార్కెట్ ఆధారిత యంత్రాంగం ద్వారా సమర్థవంతంగా వినియోగించుకోవడానికి అవకాశం లభిస్తుంది. ఈ పునర్నిర్మాణ ప్రాజెక్టును లాభదాయకంగా, వేగవంతంగా పూర్తి చేయడానికి ఆంధ్రప్రదేశ్ భవన నిబంధనల కింద ప్రభుత్వం అనేక ప్రత్యేక సడలింపులను ఇచ్చింది. రద్దీగా ఉండే ప్రాంతంలో ఎత్తైన భవనాల నిర్మాణానికి అనుమతి ఇస్తున్నారు. స్థల పరిమితిని దృష్టిలో ఉంచుకుని సాధారణ సెట్‌బ్యాక్ నిబంధనల తగ్గించారు.

సాధారణంగా ఉండే 22 శాతం పార్కింగ్ స్థల నియమాన్ని సవరించి, మొత్తం నిర్మిత ప్రాంతంలో కేవలం 10 శాతానికి పార్కింగ్ మినహాయింపు ఇచ్చింది ప్రభుత్వం. జీవీఎంసీ, పట్టణాభివృద్ధి సంస్థలు, ఇతర ప్రభుత్వ ఏజెన్సీలకు చెల్లించాల్సిన వివిధ రకాల రుసుములు, ఛార్జీల నుంచి పూర్తిగా మినహాయింపు ఉంటుంది.

వెలంపేట పునర్నిర్మాణాన్ని నిర్ణీత సమయపరిమితిలోగా పూర్తి చేసి, దీనిని మోడల్ ప్రాజెక్టుగా మార్చాలని జీవీఎంసీని ప్రభుత్వం ఆదేశించింది. దీని విజయవంతమైన అమలు ఆధారంగా, విశాఖ వ్యాప్తంగా నివసిస్తున్న పేద ప్రజలను వారి పాత నివాస ప్రాంతాల నుండి ఎక్కడికీ తరలించకుండా, వారు ఉన్న చోటే ఆధునిక గృహాలను అందించే ఆలోచన చేస్తున్నారు. దీంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా మురికివాడల పునర్నిర్మాణం, మధ్యతరగతి గృహనిర్మాణం కోసం ఒక నూతన విధివిధానాల కరపత్రాన్ని రూపొందించాలని పురపాలక పరిపాలన కమిషనర్ అండ్ డైరెక్టర్‌ను ప్రభుత్వం ఆదేశించింది. ఈ మోడల్ విజయవంతమైతే, ఆంధ్రప్రదేశ్ అంతటా పాతబడిన, రద్దీగా ఉన్న పట్టణ ప్రాంతాలను నవీకరించడానికి, అత్యంత విలువైన పట్టణ భూములను ఆర్థికంగా సద్వినియోగం చేసుకోవడానికి ఇది ఒక విప్లవాత్మకమైన మార్గదర్శకంగా నిలుస్తుంది.




# పాన్ ప్యాకేజింగ్‌లో ప్లాస్టిక్ నిషేధం

**ఎఫ్ ఎస్ ఎస్ ఏఐ కొత్త నిబంధన**

**(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)**

పాన్ మసాలా తయారీ సంస్థలకు కేంద్ర ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. పాన్ మసాలా ప్యాకేజింగ్‌లో ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధిస్తూ ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. ఇకపై పాన్ మసాలాను ప్లాస్టిక్ ఆధారిత ప్యాకెట్లలో ప్యాక్ చేయడానికి వీలుండదు. కొత్త నిబంధనల ప్రకారం పాన్ మసాలాను ప్యాక్ చేసేందుకు పేపర్, పేపర్‌బోర్డ్, సెల్యులోజ్ లేదా ఇతర సహజంగా లభించే పదార్థాలను ఉపయోగించవచ్చు. అయితే వీటిలో ఎలాంటి ప్లాస్టిక్ ఉండకూడదు. అలాగే పాలిథిలిన్, పాలీప్రొపైలిన్, పాలిస్టర్, పీవీసీ వంటి సింథటిక్ పాలిమర్లు, కో-పాలిమర్లు, లామినేట్లు కూడా అనుమతించరు. అలాగే పాన్ మసాలా ప్యాకెట్లలో సాధారణంగా ఉపయోగించే అల్యూమినియం ఫాయిల్, మెటలైజ్డ్ లేయర్లను కూడా కొత్త నిబంధనల ప్రకారం ఉపయోగించడానికి వీల్లేదు. ప్రస్తుతం ఉన్న బహుళ పొరల ప్లాస్టిక్ ప్యాకెట్ల స్థానంలో కొత్త రకం ప్యాకేజింగ్‌ను తయారీదారులు ఉపయోగించాల్సి ఉంటుంది. పాన్ మసాలా తయారీదారులకు ప్రత్యామ్నాయంగా టిన్ లేదా గ్లాస్ కంటైనర్లను కూడా ఎఫ్ఎస్ఎస్ఏఐ అనుమతించింది. అంటే పాన్ మసాలా ప్యాకేజింగ్‌లో ప్రధానంగా మూడు రకాల మార్గాలు అందుబాటులో ఉంటాయి. ప్లాస్టిక్ లేని పేపర్ ఆధారిత పదార్థాలు, టిన్ కంటైనర్లు లేదా గ్లాస్ కంటైనర్లు ఉపయోగించవచ్చు.

# 158 గ్రామాలకు తొలిసారి రోడ్లు

**మొదటి పేజీ తరువాయి...**

నిర్మాణం చేపట్టనున్నారు. 13 జిల్లాల్లో రహదారి సౌకర్యం లేని ఆవాసాలను గుర్తించి, అంచనాలు రూపొందించామన్నారు. ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన పథకం కింద రూ.422.10 కోట్ల నిధులు వచ్చాయని తెలిపారు. రోడ్ల నిర్వహణకు మరో రూ.24.47 కోట్లు విడుదలయ్యాయి. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం ఈ రోడ్ల నిర్మాణం చేపట్టనుంది. మారుమూల గ్రామాలకు నిర్మించే రహదారుల నాణ్యత విషయంలో అత్యున్నత ప్రమాణాలు పాటించాలని అధికారులను పవన్ కల్యాణ్ ఆదేశించారు. రోడ్లు, వంతెనల నిర్మాణంతో ఆయా గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు ఏర్పడి, ప్రజలకు మెరుగైన విద్య, వైద్యం, మార్కెటింగ్ సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని ఆయన తెలిపారు. ఏపీకి రెండో ర్యాంకు: మరోవైపు ఇటీవలే గ్రామీణ రహదారుల నిర్మాణంలో ఏపీ జాతీయ స్థాయిలో సత్తా చాటింది. కేంద్రం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన' పనుల్లో గుజరాత్ మొదటి ర్యాంకును కైవసం చేసుకోగా, ఆంధ్రప్రదేశ్ రెండో ర్యాంకు దక్కించుకుంది. రహదారుల నాణ్యత విషయంలో రాష్ట్రం అత్యుత్తమ ప్రమాణాలు పాటిస్తోందని కేంద్ర ప్రభుత్వం ప్రశంసల వర్షం కురిపించింది. వైఎస్సార్సీపీ పాలనలో 19వ స్థానంలో ఉన్న ఏపీ ఇప్పుడు ఏకంగా రెండో స్థానానికి ఎగబాకడం విశేషం. ఇందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీసుకున్న ప్రత్యేక చర్యలే కారణం. గ్రామీణ రహదారుల అభివృద్ధిపై ఆయన మొదటి నుంచి ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. గ్రామాల్లో ఎక్కడ రోడ్డు కావాలని ప్రజలు కోరినా, కేవలం గంటల వ్యవధిలోనే ఆ పనులను ఆయన మంజూరు చేస్తున్నారు. రోడ్ల నిర్మాణ పనుల పురోగతిపై నిరంతరం సమీక్షలు నిర్వహిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పనుల నాణ్యతను పర్యవేక్షించేందుకు సమర్థులైన అధికారులను నియమించారు. అంతేకాక పవన్ కల్యాణ్ స్వయంగా రంగంలోకి దిగి నిర్మిస్తున్న రోడ్ల నాణ్యతను క్షేత్రస్థాయికి వెళ్లి నిశితంగా పరిశీలించారు. ఈ క్రమంలోనే కాంట్రాక్టర్లు, అధికారులకు దిశానిర్దేశం చేశారు. పవన్ కల్యాణ్ కఠిన వైఖరితో రహదారుల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పెరిగాయి. రాజీ లేని నాణ్యతతో పల్లె ప్రజలకు మంచి రహదారులు అందుబాటులోకి వచ్చాయి.

# విశాఖకు జాతీయ విపత్తు నిధి

**మొదటి పేజీ తరువాయి...**

హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ లిఖితపూర్వక సమాధానంలో వివరాలను వెల్లడించారు. తొలిదశలో ఎంపిక చేసిన నగరాల్లో హైదరాబాద్‌తో పాటు అహ్మదాబాద్, బెంగళూరు, చెన్నై, కోల్‌కతా, ముంబై, పుణె ఉన్నాయని కేంద్ర హోంశాఖ వెల్లడించింది. ఈ ఏడు నగరాల్లో మొత్తం రూ.3,075.65 కోట్ల వ్యయంతో పట్టణ వరద ప్రమాద నిర్వహణ కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొంది. అలాగే రెండో దశలో ఎంపిక చేసిన నగరాల్లో విశాఖపట్నంతోపాటు భోపాల్, భువనేశ్వర్, గౌహతి, జైపూర్, కాన్పూర్, పాట్నా, రాయ్‌పూర్, త్రివేంద్రం, ఇండోర్, లఖ్‌నవూ ఉన్నట్లు తెలిపింది. ఈ నగరాల్లో మొత్తం రూ.2,444.42 కోట్ల వ్యయంతో పట్టణ వరద ప్రమాద నిర్వహణ కార్యక్రమం రెండో దశకు ఆమోదం తెలిపినట్లు పేర్కొంది. మొదటి, రెండో దశల కింద మొత్తం రూ.5,520.07 కోట్లు ఆమోదించినట్లు పేర్కొంది. ఈ వ్యయంలో హైదరాబాద్ నగరానికి రూ.319.53 కోట్లు కేటాయించగా.. ఇందులో ఎన్‌డీఎంఎఫ్ ద్వారా రూ.250 కోట్లు ఆర్థికసాయం ఉంటుందని కేంద్ర హోంశాఖ స్పష్టం చేసింది. ఇప్పటికే రూ.75 కోట్లు ఎన్‌డీఎంఎఫ్ ద్వారా నిధులు విడుదల చేసినట్లూ తెలిపింది. అలాగే, రెండో దశలో ఆమోదం పొందిన విశాఖపట్నానికి రూ.222.22 కోట్లు కేటాయించగా.. ఇందులో ఎన్‌డీఎంఎఫ్ ద్వారా రూ.200 కోట్లు కేంద్ర ఆర్థికసాయంగా ఉంటుందని వెల్లడించింది.

# మరిన్ని అగ్రిగోల్డ్ ఆస్తుల జప్తు

**మొదటి పేజీ తరువాయి...**

ప్రాంతాల్లో ఆమె పేరిట ఏకంగా 6.55 ఎకరాల భూమి ఉన్నట్లు విచారణలో వెలుగుచూసింది. ఈ భూములను డిపాజిటర్ల సొమ్ముతోనే కొన్నట్లు నిర్ధారణ కావడంతో వాటిని జప్తు చేస్తున్నారు. అగ్రిగోల్డ్ అక్రమ పెట్టుబడులు పొరుగు రాష్ట్రాలకు కూడా విస్తరించాయి. కర్ణాటక రాష్ట్రంలోనూ బంధువుల పేరిట భూములు ఉన్నట్లు అధికారులు పసిగట్టారు. బెంగళూరు జిల్లా అనేకల్ తాలూకా పరిధిలోని సర్జాపూర్ హోబ్లీలో ముత్తనల్లూర్ అమ్మనికేరి గ్రామంలో 3.32 ఎకరాల భూమిని గుర్తించారు. ఈ భూమి ఎన్. మమత అనే మహిళ పేరుతో ఉంది. ఇది కూడా అగ్రిగోల్డ్ బాధితుల సొమ్ముతోనే కొనుగోలు చేసినట్లు అధికారులు పక్కాగా ధ్రువీకరించుకున్నారు. ఈ భూములను తక్షణమే జప్తు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. జప్తు చర్యలను త్వరితగతిన పూర్తి చేయాలని సీఐడీ డైరెక్టర్ జనరల్‌ను (డీజీ) ప్రభుత్వం ఆదేశించింది. కాగా అగ్రిగోల్డ్ కేసులో గతంలో అటాచ్ చేసిన పాత ఆస్తుల విక్రయానికి ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. అగ్రిగోల్డ్‌కు చెందిన 6,000 ఎకరాలకు పైగా భూములను వెంటనే వేలం వేయాలని ప్రభుత్వం నియమించిన మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. ఆగస్టు 5వ తేదీన రాష్ట్ర సచివాలయంలో హోం మంత్రి వంగలపూడి అనిత అధ్యక్షతన ఈ సబ్ కమిటీ సమావేశం జరిగింది. ఇందులో డిపాజిటర్ల ప్రయోజనాల పరిరక్షణపై మంత్రులు సమగ్రంగా చర్చించారు. భూముల వేలం ప్రక్రియను వేగంగా ప్రారంభించాలని సీఐడీ, పోలీసు శాఖలను సబ్ కమిటీ ఆదేశించింది.

# ఫాస్ట్ ట్రాక్ కోర్టు..!

**మొదటి పేజీ తరువాయి...**

రామకృష్ణారెడ్డి భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా 2 గంటల పాటు సమీక్షించారని, నిందితులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని తమకు, పోలీసులకు స్పష్టంగా ఆదేశించినట్లు తెలిపారు. ప్రియాంక కుటుంబానికి తామంతా అండగా ఉన్నామని బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు అండగా ఉంటామన్నారు. కేసులో నిందితులకు కఠిన శిక్ష పడేందుకు ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేయాలని ప్రియాంక తండ్రి కోరిన విషయాన్ని సీఎం దృష్టికి తెచ్చామని ఎమ్మెల్యేలు తెలిపారు. ప్రత్యేకంగా స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం వేసి అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు చేస్తారని తెలిపారు. ప్రియాంక ఘటనలో ఎక్కడా పోలీసుల వైఫల్యం లేదని స్పష్టం చేశారు. ఘటన జరిగినప్పుడు కొందరు మీడియా ప్రతినిధులు ఘటనా స్థలిలో ఉన్నప్పటికీ వార్త రాయలేదని, 3 రోజులపాటు మీడియాలో ఎక్కడా వార్త రాకుండా ఎవరు, ఎవరిని మేనేజ్ చేశారనే విషయంపైనా సిట్ దర్యాప్తు చేస్తుందన్నారు. ఘటన బయటకు రాకపోవడం వెనుక ప్రభుత్వ ప్రమేయం ఏమీ లేదని స్పష్టం చేశారు. నిందితులు ఎంతటివారైనా వదిలే ప్రసక్తి లేదని కఠినంగా శిక్షిస్తామని ఎమ్మెల్యేలు స్పష్టం చేశారు. : ప్రియాంక ఈ నెల 3న రాత్రి రాజమహేంద్రవరం ప్రసాద్ ఆదిత్యమాల్‌లో సినిమా చూసి, సహచర విద్యార్థి ఉమేష్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. రద్దీ కారణంగా వాహనాలు థియేటర్ గేటు వద్ద ఆగగా అదే సమయంలో నామవరానికి చెందిన సురవరపు దుష్యంత్, లాలాచెరువుకు చెందిన ఆంద్రూ విలియం జోసెఫ్‌లు మద్యం మత్తులో కారు వేగంగా నడుపుతూ వచ్చి వీరి బైక్‌ను ఢీకొట్టారు. తరువాత మరో రెండుసార్లు బలంగా ఢీకొట్టి, పైనుంచి కారు వెళ్లడంతో కిందపడిపోయిన ప్రియాంక తలకు తీవ్ర గాయమైంది. ఆమెను స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. పరిస్థితి విషమించడంతో బుధవారం సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ఆమె చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు.



# ప్రజలపై భారం పడరాదు

**మొదటి పేజీ తరువాయి...**

ప్రాథమిక రంగం వ్యవసాయ రంగంలో 13.5 శాతం, పారిశ్రామిక రంగంలో 10.6 శాతం, తృతీయ రంగమైన సేవల రంగంలో 9.9 శాతం చొప్పున వృద్ధి నమోదైంది. పాలనలో టెక్నాలజీని అనుసంధానించడంతో రాష్ట్ర జీఎస్టీ వసూళ్లు 21 శాతం పెరిగి రూ. 13,282 కోట్లకు చేరాయి. అలాగే ఏపీలో సాధారణ ఎగుమతులు రూ. 16,322 కోట్లకు చేరుకోగా, ఎస్‌టీపీఐ ఐటీ ఎగుమతుల్లో 32.2 శాతం వృద్ధి నమోదైంది. వాణిజ్య వాహనాల నమోదులో 51.6 శాతం మేర భారీ పెరుగుదల కనిపించింది. వీటితో పాటు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన రూ. 2.88 లక్షల కోట్ల మెగా ప్రాజెక్టుల పెట్టుబడుల గ్రౌండింగ్‌లో 75.4 శాతం మేర పురోగతి సాధించినట్లు ఈ నివేదిక స్పష్టం చేసింది.

**ధరల పర్యవేక్షణ కమిటీ..**

వర్షాభావ పరిస్థితుల కారణంగా నిత్యావసర వస్తువుల ధరలు పెరగకుండా చర్యలు చేపట్టేందుకు, నిరంతరం పర్యవేక్షించడానికి ప్రభుత్వం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేస్తోంది. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గడంతో శ్రీశైలం, నాగార్జునసాగర్ వంటి ప్రధాన జలాశయాల్లో నీటి మట్టాలను దృష్టిలో ఉంచుకుని తాగు, సాగునీటి ప్రణాళికలను అధికారులు రూపొందిస్తున్నారు. రాష్ట్ర జీఎస్‌డీపీ పురోగతి, శాఖల వారీగా పనితీరును (ఖ్రూ×ం) నిరంతరం సమీక్షించేందుకు ప్రతినెల ఆర్థిక నివేదికల వ్యవస్థను అమలుచేసి, సంక్షోభం తలెత్తకుండా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.



# ఆక్వా రైతులకు విద్యుత్ రాయితీ

**యూనిట్‌కు రూ. 1.50పైసలకే ప్రకటించిన ప్రభుత్వం**

**(అమరావతి - -జయజయహే)**

ఆక్వా రైతులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శుభవార్త తెలిపింది. ఆక్వా రైతన్నలకు విద్యుత్ రాయితీ కొనసాగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అన్నదాతలకు యూనిట్ విద్యుత్‌ను రూ.1.50లకే అందించనుంది. ఈ మేరకు ఆక్వా రైతులకు విద్యుత్ రాయితీపై మంగళవారం ఎనర్జీ శాఖ జీవో ఆర్టీ నంబర్- 57 జారీ చేసింది. కొత్తగా ప్రకటించిన ఆక్వా జోన్లలోని అర్హత కలిగిన అన్ని ఆక్వా ఫారాలకు రూ.1.50లకే యూనిట్ రాయితీని ఏపీ సర్కార్ కల్పించనుంది. ఏపీఎస్ ఏడీఏ , సీఏఏ చట్టాల కింద రిజిస్టరైన అన్ని అర్హత కలిగిన ఆక్వా ఫారాలకు కూడా రూ.1.50లకే యూనిట్ విద్యుత్‌ను ఏపీ సర్కార్ అందించనుంది. సుమారు 6,500 రిజిస్టర్డ్ ఆక్వా ఫారాలకు ఈ రాయితీ వర్తించనుంది. భవిష్యత్తులో ఏపీఎస్ ఏడీఏ , సీఏఏ రిజిస్ట్రేషన్ పొందే అర్హత కలిగిన ఈ ఫారాలకు కూడా రిజిస్ట్రేషన్ తేదీ నుంచి రాయితీ కల్పించనుంది. 2026 జూన్ 1వ తేదీ నుంచి రూ.1.50లకే యూనిట్ రాయితీని అమలు చేయనుంది. ఆక్వా ఉత్పత్తి వ్యయంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతన్నలకు ఏపీ సర్కార్ నిర్ణయంతో ఊరట కలిగింది. ప్రపంచ ఆక్వా ఎగుమతుల మార్కెట్‌లో పోటీ ధర, నాణ్యతతో నిలదొక్కుకునేందుకు ఈ విద్యుత్ రాయితీ అందించనుంది. ఆక్వా రైతుల వివరాలను మత్స్యశాఖ డిస్కమ్ లు తీసుకుంది. మత్స్యశాఖ ప్రతిపాదనను పరిశీలించిన అనంతరం రాయితీ విస్తరణకు ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది.

# తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్‌కు మహిళలే డ్రైవర్లు

**మొదటి పేజీ తరువాయి...**

నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవింద్ బాబులతో కలిసి మంత్రి పాల్గొని, ఏరియా ఆసుపత్రిలోని నూతన సదుపాయాలైన డయాలసిస్ యూనిట్లు, ఫిజియోథెరపీ ల్యాబ్‌లు, ఆధునిక లేబర్ రూమ్‌లు, ఆర్వో నీటి ప్లాంట్‌ను కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ.. నూతనంగా ప్రవేశపెట్టిన వాహనాల్లో బాలింతలు, గర్భిణుల సౌకర్యం, భద్రత కోసం పలు విప్లవాత్మక మార్పులు చేసినట్లు తెలిపారు. అత్యవసర సమయాల్లో రక్షణ కోసం 6 ఎయిర్‌బ్యాగ్‌లు, జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థ, తక్షణ సాయం కోసం ఎస్ఓఎస్ బటన్ అమర్చారు. ప్రయాణ సమయంలో గర్భిణులు సులభంగా ఎక్కడానికి ఫుట్ రెస్ట్, హ్యాండ్ రైల్స్, స్లైడింగ్ డోర్లు, చైల్డ్ లాక్, రివర్స్ పార్కింగ్ సెన్సార్లను అందుబాటులోకి తెచ్చారు. నవజాత శిశువుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఉష్ణోగ్రతను నియంత్రించే ప్రత్యేక ఏసీ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ప్రయాణ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ.. తల్లిపాలు ఇవ్వడం, నవజాత శిశువుల సంరక్షణ, పోషకాహార నియమాలు, టీకాలు, ప్రసవానంతర జాగ్రత్తలపై ప్రభుత్వ మార్గదర్శకాలను తెలియజేసే ఆడియో నిరంతరం ప్లే అయ్యేలా ఆడియో సిస్టమ్‌ను అమర్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆరోగ్య శాఖ కమిషనర్ కె.వి.ఎన్.చక్రధర్ బాబు మాట్లాడుతూ.. పల్నాడు జిల్లాలో సున్నా మాతా మరణాలు లక్ష్యంగా ఆరోగ్య శాఖ పనిచేస్తుందని స్పష్టం చేశారు. టీనేజ్ గర్భధారణలను అరికట్టడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని, ఒకవేళ అలాంటి కేసులు నమోదైతే ఆ బాలికలకు ప్రసవ సమయంలో సంపూర్ణ భద్రత, మెరుగైన వైద్య సేవలు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించిన మహిళలను సురక్షితంగా వారి ఇళ్లకు చేర్చడానికి ఈ వాహనాలు ఉచిత సేవలు అందిస్తాయి. అంతేకాకుండా కాంప్లికేషన్లు ఉండే అత్యధిక ప్రమాదం ఉన్న గర్భిణులను త్వరితగతిన సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించి, తక్షణ చికిత్స అందించడానికి కూడా ఇవి ఉపయోగపడతాయి. ఈ ఉచిత సేవలు కావలసిన వారు 102 నంబరుకు కాల్ చేయవచ్చని అధికారులు తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సతీష్ బాబుతో పాటు బీజేపీ, జనసేన పార్టీల జిల్లా స్థాయి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# హజ్ మొదటి విడత గడువు పొడిగింపు

### 17 తేదీ వరకు పొడిగించిన కేంద్ర హజ్ కమిటీ

### మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్

**అమరావతి, ఆగస్టు11 (జయ జయహే )**



పవిత్ర హజ్ యాత్ర -2027 కు ఎంపికైన హాజీలు యాత్ర కోసం చెల్లించాల్సిన రుసుము మొదటి విడత మొత్తం చెల్లింపు గడువు తేదీని కేంద్ర హజ్ కమిటీ పొడిగించినట్లు మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. 10వ తేదీ వరకు మాత్రమే ఉన్న గడువును 17 వ తేదీ వరకు పొడిగించినట్లు మంగళవారం అమరావతి లో విడుదల చేసిన ఒక ప్రకటనలో మంత్రి వెల్లడించారు. ఎంపికైన యాత్రికులందరూ అవసరమైన మొత్తాన్ని ఇప్పటివరకూ జమ చేయని పక్షంలో రూ. 1,52,300 మొత్తాన్ని పొడిగించిన గడువు లోపు పూర్తి చేయాలని సూచించారు. అలాగే ఎంపికైన హజ్ యాత్రికులలో షార్ట్ హజ్ ప్యాకేజీని ఎవ్వరైతే కోరుకున్నారో వారు తమను షార్ట్ హజ్ ప్యాకేజీ కింద పరిగణించాలని ధ్రువీకరిస్తూ, వారు కూడా పొడిగించిన గడువులోగా అవసరమైన మొత్తాన్ని జమ చేయాలని పేర్కొన్నారు. హజ్ యాత్రకు వెళ్లే హాజీలంతా క్రెడిట్ కార్డ్/డెబిట్ కార్డ్/నెట్ బ్యాంకింగ్ ఉపయోగించి ష్ట్రజూం://ష్ఠ్ఘుయిఎశీఎఎ్టవవ.స్త్రశీజ.అఅ లేదా హజ్ సువిధా యాప్‌లో అందుబాటులో ఉన్న ఇ-చెల్లింపు సౌకర్యం ద్వారా మొత్తాన్ని చెల్లించవచ్చన్నారు. ప్రతి కవర్ నంబర్‌కు ఎదురుగా హజ్ కమిటీ ఆఫ్ ఇండియా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న బ్యాంక్ రిఫరెన్స్ నంబర్‌ను ఉపయోగించి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లేదా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏదైనా శాఖల లో హజ్ కమిటీ ఆఫ్ ఇండియా ఖాతాలో నిర్దేశించిన పే-ఇన్-స్లిప్ ద్వారా చెల్లించవచ్చునని తెలిపారు. ప్రతి కవర్‌కు అందించిన ప్రత్యేకమైన బ్యాంక్ రిఫరెన్స్ నంబర్‌ను డిపాజిట్‌లో తప్పనిసరిగా పేర్కొనాలన్నారు. ఈ నెల 17తేదీ లోపు అవసరమైన మొత్తాన్ని డిపాజిట్ చేయడంలో విఫలమైన ఎంపికైన యాత్రికులందరి హజ్ సీట్లు, ఎటువంటి తదుపరి నోటీసు లేకుండా రద్దు చేయబడతాయని కేంద్ర హజ్ కమిటీ హాజీలందరికీ తెలియజేయడం జరిగిందని మంత్రి ఫరూక్ తెలిపారు. వచ్చే ఏడాది హజ్ యాత్ర కోసం 2830 మంది యాత్రికులు ఏపీ నుంచి దరఖాస్తు చేసుకోగా, 2792 మంది ఎంపికయ్యారని, వీరిలో 460 మంది షార్ట్ హజ్ కు దరఖాస్తు చేసుకున్న విషయాన్ని మంత్రి మరోసారి గుర్తు చేశారు. విజయవాడ ఏంబార్కేషన్ కేంద్రం నుంచి హజ్ కు వెళ్లేందుకు 637 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. విజయవాడ ఎంచుకున్న వారందరికీ రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ.లక్ష ఆర్థిక సాయంతో పాటు వారికి అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలను, ఏర్పాట్లను పగడ్బందీగా చేసేందుకు సీఎం చంద్రబాబు నేతృత్వం లోని కూటమి ప్రభుత్వం ముందస్తు కార్యాచరణ సిద్ధం చేసిందని మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ స్పష్టం చేశారు.



## వందేమాతరం బిల్లుకు ఆమోదం

మొదటి పేజీ తరువాయి...

కూడా లభిస్తుందని ప్రభుత్వం తన ప్రకటనలో తెలిపింది. ఈ కొత్త చట్టంతో 'జాతీయ గౌరవానికి భంగం కలిగించడాన్ని నిరోధించే (సవరణ)చట్టం 2026' చట్టంగా మారింది. లోక్‌సభ జూలై 30న ఈ బిల్లును ఆమోదించగా, దానికి ఒక రోజు ముందే రాజ్యసభ దీనికి ఆమోదం తెలిపిందని తెలిసిందే. వందేమాతరం సవరణ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదంపై కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఆయన ఎక్స్ వేదికగా పోస్ట్ చేస్తూ.. సభలో ఎలాంటి చర్చ లేకుండానే ఈ బిల్లు ఆమోదం పొందిందని తెలిపారు. అదే సమయంలో తనకు జాతీయ గీతం (జనగణమన), జాతీయ గేయం (వందేమాతరం) లపై ఎంతో గౌరవం ఉందన్నారు. 'వందేమాతరం బిల్లుకు రాష్ట్రపతి ముర్ము ఆమోదముద్ర వేశారు. పార్లమెంటులో ఎటువంటి చర్చ లేకుండా ఆమోదం పొందిన ఈ సవరణ ప్రకారం.. ప్రతి ప్రభుత్వ కార్యక్రమంలో ప్రారంభంలో, ముగింపులో జాతీయ గీతంతో పాటు జాతీయ గేయాన్ని పూర్తిగా ఆలపించడం తప్పనిసరి' అని తెలిపారు.

**చట్టం ద్వారా ఓపికను అమలు చేయవచ్చా? - శశి థరూర్**

'నేను ఈ రెండింటినీ ఎంతగానో గౌరవిస్తాను. నేను జాతీయ గేయం (వందేమాతరం) లోని మొదటి రెండు చరణాలు, పూర్తి జాతీయ గీతాన్ని (జన గణ మన) పాడగలను. కానీ కఠిన వైఖరి గల వ్యక్తులు బహుశా విస్మరించిన ఒక ఆచరణాత్మక అంశాన్ని - మానవ నైజాన్ని నేను ఎత్తిచూపాలనుకుంటున్నాను. 'జన గణ మన' సమయంలో వీక్షకులు గౌరవప్రదంగా నిలబడి పూర్తి 52 సెకన్ల పాటు దృష్టి సారించాలి. పూర్తి జాతీయ గేయం పాడటానికి 3 నిమిషాల 10 సెకన్ల సమయం పడుతుంది. ఈ రెండింటి కంటే ముందు తమిళ భాషలో రాష్ట్ర గేయాన్ని కూడా పాడాలని తమిళనాడు ప్రభుత్వం నిర్ణయించింది. దానికి మరో 2 నిమిషాలు పడుతుంది. ప్రతి కార్యక్రమానికి ముందు, తరువాత వీక్షకులు 5 నిమిషాల పాటు, అంటే మొత్తంగా 12 నిమిషాలదనంగా గౌరవప్రదంగా నిలబడతారని నిజంగా ఆశించగలమా? చట్టం ద్వారా గౌరవాన్ని, ఓపికను అమలు చేయవచ్చా? ఈ బిల్లు లక్ష్యం జాతీయ గేయం పట్ల గౌరవాన్ని పెంచడమే అయినప్పటికీ, అది నెరవేరకపోగా, దానికి విరుద్ధంగా జరిగే అవకాశం ఉందని' శశిథరూర్ చేసిన పోస్ట్ హాట్ టాపిక్ అవుతోంది.



## జగన్ దృష్టికి క్రైస్తవుల సమస్యలు

### బొల్లవరపు జాన్ వెస్లీ

**అమరావతి, ఆగస్టు 11, జయ జయహే**



తాడేపల్లిలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని మంగళవారం ఆ పార్టీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు బొల్లవరపు జాన్ వెస్లీ కలిశారు. ఈ సందర్భంగా క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర సెక్రటరీ మోర్తా శ్రావణ్ కుమార్‌ని జగన్‌కు పరిచయం చేస్తూ జ్ఞాపికను బహుకరించారు. ఈ సందర్భంగా క్రైస్తవులకు సంబంధించిన కొన్ని విషయాలపై వైయస్ జగన్మోహన్ రెడ్డితో చర్చించారు. క్రైస్తవుల సమస్యల విషయంలో కూటమి సర్కార్ ఆడుతున్న నాటకాలను జగన్‌కు వివరించారు. కూటమి హయాంలో క్రైస్తవులు ఎలా నష్టపోతున్నది....ప్రభుత్వం ఎలా మోసగిస్తున్నదీ వివరించారు. జాన్ వెస్లీ వివరించిన అన్ని విషయాలను జగన్ విని క్రైస్తవులంతా కూటమిపై పోరాటానికి సిద్ధపడాల్సిందిగా పిలుపునిచ్చినట్టు తెలిపారు.





## భారతీయ విద్యను సమాజంలోకి తీసుకెళ్లడమే లక్ష్యం

### విద్యా భారతి ఏపీ సహ ప్రముఖ్ దేవ త్రినాధ్

**విశాఖపట్నం, ఆగస్టు 11, జయ జయహే :**

దేశంలో విలువలతో కూడిన నాణ్యమైన భారతీయ విద్యను సమాజంలోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా ఆగస్టు 8,9 తేదీలలో నోయిడా భావురావ్ దేవరస్ సరస్వతీ విద్యా మందిర్ లో నిర్వహించిన సమావేశంలో విశాఖకు చెందిన విద్యా భారతి ఆంధ్రప్రదేశ్ సహ ప్రముఖ్ ఎం దేవా త్రినాధ్ రావు పాల్గొన్నారు. విశాఖపట్నం బివీకే విద్యాసంస్థల ప్రచార విభాగ ప్రముఖ్ గా సేవలందిస్తున్న దేవా త్రినాధ్ రావు ను ఆంధ్రప్రదేశ్ సహ ప్రముఖ్ గా నియమించడంతో త్రినాధ్ రావు కు స్నేహితులు,కుటుంబసభ్యులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సహ ప్రముఖ్ ఎం దేవా త్రినాధ్ రావు మాట్లాడుతూ సంస్థ కార్యకలాపాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్ళడానికి శాయశక్తులా ప్రయత్నిస్తానన్నారు.

## మూడు రోజులు ఏం జరిగింది?

### ప్రియాంక మృతి ఘటనపై సమగ్ర విచారణ జరపాలి: మార్గాని భరత్

**రాజమహేంద్రవరం:జయ జయహే:ఆగస్టు 11:**

సంచలనం సృష్టించిన మెడికో ప్రియాంక మృతి ఘటనపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని మాజీ ఎంపి , వైసిపి జాతీయ అధికార ప్రతినిధి, సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మార్గాని భరత్ రామ్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక వివెల్ పురంలోని మార్గాని ఎస్టేట్స్‌లోని వైసిపి కార్యాలయంలో నిర్వహించిన మీడియాసమావేశంలో ఆయన కూటమి ప్రభుత్వంపై పలు ప్రశ్నలు సంధించారు. ఆగస్టు 3న ఘటన జరిగితే 6వ తేదీ వరకు ఎందుకు గోప్యంగా ఉంచారని ప్రశ్నించారు. మూడు రోజుల పాటు నిందితులు ఎక్కడ ఉన్నారు? పరారీలో ఉన్నారా? పోలీసుల కస్టడీలో ఉన్నారా? అధికార పార్టీ అండతో వారిని దాచిపెట్టారా? అనే అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. తీవ్రమైన ఘటనను తొలుత చిన్న యాక్సిడెంట్"గా ఎందుకుచూపించారని, రాష్ అండ్ నెగ్లిజెంట్ డ్రైవింగ్ వంటి తేలికపాటి సెక్షన్లు ఎందుకు నమోదు చేశారని ప్రశ్నించారు. పలుమార్లు స్కూటీని ఢీకొట్టి, తలపై నుంచి కారు వెళ్లినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్ననేపథ్యంలో తీవ్రమైన సెక్షన్లు ఎందుకు నమోదు చేయలేదో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఘటనకసంబంధించిన సిసి టివి ఫుటెజిలు, కాల్ డేటాను పూర్తిస్థాయిలో పరిశీలించాలని కోరారు. ప్రసాదిత్య మాల్ వద్ద ఘటన అనంతరం ఎవరెవరికి ఫోన్లు వెళ్లాయి? ఏం మాట్లాడారు? కేసు దర్యాప్తు చేస్తున్న సీఐ బాజీ లాల్ ఆరోజు ఎవరెవరితో మాట్లాడారో కాల్ డేటాను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే బాధ్యత నుంచి తప్పించుకునేలా వ్యవహరిస్తున్నారని మార్గాని భరత్ విమర్శించారు. డాక్టర్ ప్రియాంక ఘటనపై తాను ఫేస్‌బుక్‌లో చేసిన పోస్టును మెటాకు పంపించి తొలగించారని ఆరోపించారు. మద్యం మత్తులో జరిగిన హిట్‌అండ్‌రన్‌గా కేసును చూపించడానికి ప్రయత్నం జరిగిందా? ప్రియాంక కుటుంబ సభ్యుల వాదనలను ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదని ప్రశ్నించారు. ప్రకాశ్‌నగర్ పోలీసుల దర్యాప్తు తీరుపై కూడా అనుమానాలు ఉన్నాయని, అవసరమైతే పోలీసుల పాత్రపైనా విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఘటనను అణిచివేయడానికి రాజకీయ ఒత్తిడి ఏమైనా ఉందా? నిజాలను దాచే ప్రయత్నం జరిగిందా? అనే అంశాలపై సమగ్ర దర్యాప్తు జరగాలని అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలను కుదిపేసిన ఈ ఘటనపై సోషల్ మీడియా ఎందుకు మౌనంగా ఉందని ప్రశ్నించిన భరత్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ ఘటనను సీరియస్‌గా తీసుకుని స్పందించాలని కోరారు. ప్రియాంక కుటుంబానికి వైసీపీ అండగా ఉంటుందని, వాస్తవాలు వెలుగులోకి వచ్చే వరకు వారికి న్యాయం కోసం పోరాడుతామని తెలిపారు. నిందితులకు కఠిన శిక్షలు పడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులుపాల్గొన్నారు

## క్రీడారంగం ద్వారా ప్రజల్లోకి కాంగ్రెస్ సిద్ధాంతాలు

### ఏపీసీసీ స్పోర్ట్స్ సెల్ చైర్మన్ జి.వి.వి.ఎస్. కమలాకర్

**విశాఖపట్నం, ఆగస్టు 11, జయ జయహే**



కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను క్రీడా రంగంలోకి తీసుకెళ్లేందుకు ఈ నెల 17 నుంచి సెప్టెంబర్ 10వరకూ అన్ని జిల్లాల్లోనూ పర్యటిస్తానని ఏపీసీసీ స్పోర్ట్స్ సెల్ చైర్మన్ జి.వి.వి.ఎస్. కమలాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీసీసీ అధ్యక్షులు వైఎస్ షర్మిలా రెడ్డి ఆదేశానుసారం ఏపీసీసీ స్పోర్ట్స్ సెల్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా వారీ కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో పర్యటించి స్పోర్ట్స్ సెల్ బలోపేతం, సభ్యత్వ విస్తరణ, మరియు సంస్థాగత అంశాలపై సంబంధిత కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువజన కాంగ్రెస్, ఎన్.ఎస్.యూ.ఐ ప్రతినిధులు మరియు క్రీడా రంగానికి చెందిన వారితో సమావేశాలు నిర్వహించడం, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను క్రీడా రంగంలోకి విస్తృతంగా తీసుకువెళ్లడానికి కృషి చేస్తానని ప్రకటించారు. ఆయా తేదీలలో మీ జిల్లాలో జరగబోవు కార్యక్రమాలకు తగు ఏర్పాట్లు చేసి స్పోర్ట్స్ సెల్ చైర్మన్ కు సహకరించవలసినదిగా కోరారు. ఈ మేరకు ఆయా జిల్లాల నగర కాంగ్రెస్ అధ్యక్షులకు టూర్ ప్రోగ్రాంను పంపించినట్టు వెల్లడించారు.

# ప్రభుత్వ వాహన సేవలకు టిప్పులు ఇవ్వక్కర్లేదు

### - 102 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల ప్రారంభంలో జేసీ విద్యాధరి

### - గర్భిణులు, బాలింతలు, నవ జాత శిశువులకు ఉచిత రవాణా సేవలు

### - ఎమ్మెల్యేలు పల్లా, విష్ణుకుమార్ రాజు హాజరు

**విశాఖపట్నం, ఆగస్టు 11, జయ జయహే**



గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువులకు సురక్షితమైన, సకాలంలో వైద్య సేవలు అందించడంతో పాటు మాతా-శిశు ఆరోగ్య సంరక్షణను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న '102 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస' వాహనాలను మంగళవారం జాయింట్ కలెక్టర్ జి. విద్యాధరి లాంఛనంగా ప్రారంభించారు. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు భాగస్వామ్యమై జెండా ఊపి వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ మాతా శిశు మరణాల రేటును తగ్గించడం, ప్రభుత్వ ఆసుపత్రుల్లో సురక్షిత ప్రసవాలను ప్రోత్సహించడం, ప్రసవానంతరం తల్లీబిడ్డలను సురక్షితంగా ఇంటికి చేర్చడం, పేద కుటుంబాలపై రవాణా వ్యయ భారాన్ని తగ్గించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమన్నారు. గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువులకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. విశాఖపట్నం జిల్లాకు 16 అత్యాధునిక వాహనాలు కేటాయించారని జేసీ వివరించారు. ప్రస్తుతం జిల్లాలో కింగ్ జార్జ్ ఆసుపత్రి వద్ద 9, అగనంపూడి వద్ద 2, విక్టోరియా ఆసుపత్రి వద్ద 5 వాహనాలు అందుబాటులో ఉంచి సేవలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ప్రయాణికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ వాహనాల్లో రియర్ సీట్ బెల్టులు, ఎయిర్‌బ్యాగ్‌లు, అగ్నిమాపక పరికరాలు, ఎయిర్ కండీషనింగ్, మొబైల్ ఛార్జింగ్ సదుపాయం, హ్యాండ్ శానిటైజర్, టిష్యూ పేపర్లు, డస్ట్‌బిన్ వంటి ఆధునిక సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా రియల్‌టైమ్ జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థ, అత్యవసర పరిస్థితుల్లో కాల్ సెంటర్‌కు సమాచారం చేరవేసే ఎమర్జెన్సీ అలర్ట్ స్విచ్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రయాణ సమయంలో తల్లి-శిశు ఆరోగ్యం, శిశు పోషణ, ప్రసవానంతర సంరక్షణకు సంబంధించిన అవగాహన సందేశాలను ప్రసారం చేసే ప్రత్యేక ఆడియో వ్యవస్థను కూడా అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఈ సేవలు పూర్తిగా ఉచితమని, లబ్ధిదారులు ఎట్టి పరిస్థితుల్లోనూ డ్రైవర్లకు రుసుములు లేదా టిప్పులు చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. పి. జగదీశ్వరరావు, కేజీహెచ్ సూపరింటెండెంట్ డా. ఐ. వాణి, కేజీహెచ్ అడ్మినిస్ట్రేటర్ బి.వి. రమణ, విక్టోరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. పి. ఉష, డీసీహెచ్ఎస్ డా. నరేంద్ర సింగ్, ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ కో-ఆర్డినేటర్ డా. అప్పారావు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

For a pure tomorrow..
జయహో



## ప్రజల సహకారంతోనే అభివృద్ధి సాధ్యం

### వార్డుల పర్యటనలో జోనల్ కమిషనర్ శంకరరావు

(పెందుర్తి, జయ జయహే )

అభివృద్ధి పనులు ప్రజల సహకారంతోనే సాధ్యమవుతుందని, వారు సూచించిన సమస్యలు గుర్తించి పరిష్కారానికి నివేదికలు సిద్ధం చేస్తామని పెందుర్తి జోనల్ కమిషనర్ హనుమంతు శంకరరావు అన్నారు. 94 వ వార్డ్ కృష్ణరాయపురం ఎన్.ఏ. డి. కాలనీ లో మంగళవారం ఉదయం పర్యటించారు. జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశాల మేరకు ప్రతీ రోజూ జోన్ పరిధిలోని ప్రాంతాల్లో పర్యటిస్తున్నట్లు చెప్పారు. కృష్ణరాయపురం ఎన్.ఏ. డి. కాలనీ లోని పార్క్, ఇటీవల నిర్మించిన కనెక్టింగ్ కల్వర్ట్, కాలనీ రోడ్లను పరిశీలించారు. కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కాలనీ లోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ప్రధానంగా పార్క్ అభివృద్ధి, కాలనీ లో పాడైన సీసీ రోడ్లను బాగుచేయాలని కోరారు. అదేవిధంగా దాదాపుగా శిధిలావస్థ కు చేరిన కమ్యూనిటీ హాల్ పునర్ నిర్మాణానికి నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ శంకరరావు మాట్లాడుతూ కాలనీ సమస్యలను జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. త్వరలో సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని హామీ ఇచ్చారు. జీవీఎంసీ నిర్వహిస్తున్న హ్యాపీ సండే కార్యక్రమాన్ని ఈ కాలనీలో ఏర్పాటు చేయాలని అసోసియేషన్ సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్. ఎస్. రమణ, శానిటరీ ఇన్స్పెక్టర్ చందు, వార్డ్ సెక్రటరీ హరి కుమార్, ఎన్ఏడి కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు బీటీ మూర్తి, కార్యదర్శి కోటేశ్వరరావు, కోశాధికారి అప్పారావు, కాలనీ ప్రతినిధులు కృష్ణ, కోదండ, శ్రీను, రవికాంత్, రమణ, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.




## అరకులో ఎండిఓ ఆకస్మిక తనిఖీలు

అరకువేలి, ఆగస్టు 11, జయ జయ హే

అల్లూరి జిల్లా అరకులోయ లో మంగళవారం ఇంచార్జి ఎండీఓ పి వీరభద్రరావు పలుచోట్ల ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రతి రోజు పారిశుధ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపడంతో పాటు ,డి ఆర్ డిపోలు తనిఖీ ,సచివాలయాలు, అంగన్వాడి కేంద్రాలు తనిఖీ చేసి పిల్లలు హాజరు పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. అలాగే అభివృద్ధి పనుల పురోగతిని కూడ పరిశీలించారు.


# సైబర్ భద్రతలో తెలంగాణ నంబర్ వన్ - దేశానికే ఆదర్శం

(హెచ్.ప్రతాప్)

**డిజిటల్ యుగంలో అభివృద్ధి ఎంత వేగంగా సాగుతోందో, సైబర్ నేరాల రూపురేఖలు కూడా అంతే వేగంగా మారుతున్నాయి. ఒకప్పుడు దొంగతనాలు, మోసాలు భౌతిక ప్రపంచానికే పరిమితమైతే, నేడు అవి మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా, ఆన్‌లైన్ బ్యాంకింగ్, డిజిటల్ పేమెంట్స్ వేదికగా కోట్ల రూపాయల నష్టాన్ని కలిగిస్తున్నాయి. సాంకేతికతను ప్రజల సంక్షేమానికి వినియోగించాలనే ఉద్దేశంతో ప్రారంభమైన డిజిటల్ విప్లవాన్ని కొందరు నేరస్థులు అక్రమ సంపాదనకు ఆయుధంగా మార్చుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణ దేశంలోనే తొలి స్థానాన్ని సాధించడం కేవలం ఒక పరిపాలనా విజయం మాత్రమే కాదు, సమర్థవంతమైన సైబర్ గవర్నెన్స్‌కు నిలువెత్తు నిదర్శనం.**




ప్రధానమంత్రి కార్యాలయం నిర్వహించిన దేశవ్యాప్త సమీక్షలో, కేంద్ర హోం మంత్రిత్వ శాఖ పరిధిలోని ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (ఐ4సీ) రూపొందించిన పలు కార్యక్రమాల అమలులో తెలంగాణ అత్యుత్తమ పనితీరును




కనబరిచింది. స్టేట్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (ఎస్4సీ) ఏర్పాటు, ఈ-జీరో ఎఫ్ఐఆర్, గ్రీవెన్స్ రెడ్రెస్సల్ మెకానిజం, మనీ రెస్టోరేషన్ మాడ్యూల్, సహయోగ్ పోర్టల్, సమన్వయ పోర్టల్, సైబర్ హాట్‌స్పాట్ల నిర్వహణ, లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బందికి సామర్థ్యాభివృద్ధి, ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలు వంటి తొమ్మిది కీలక ప్రమాణాల్లో రాష్ట్రం అత్యుత్తమ ఫలితాలు సాధించడం అభినందనీయం.

గణాంకాలు తెలంగాణ విజయాన్ని మరింత బలంగా నిరూపిస్తున్నాయి. గ్రీవెన్స్ రెడ్రెస్సల్ మెకానిజం ద్వారా అందిన 2,368 ఫిర్యాదుల్లో 2,086 ఫిర్యాదులను పరిష్కరించి సుమారు 88 శాతం యాక్షన్ రేట్ నమోదు చేసింది. మనీ రెస్టోరేషన్ మాడ్యూల్ ద్వారా 28 వేలకుపైగా కేసుల్లో చట్టపరమైన చర్యలు ప్రారంభించి సుమారు రూ.16.42 కోట్ల మేర బాధితుల డబ్బును తిరిగి పొందే ప్రక్రియ చేపట్టడం విశేషం. సహయోగ్ పోర్టల్ ద్వారా అభ్యంతరకర కంటెంట్ తొలగింపులో దాదాపు 89.41 శాతం, సమన్వయ పోర్టల్ ద్వారా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన అభ్యర్థనల పరిష్కారంలో 96.68 శాతం సామర్థ్యాన్ని ప్రదర్శించింది. ప్రజలకు మరింత చేరువ కావడానికి ప్రత్యేక హెల్ప్‌లైన్, అవగాహన వీడియోలు, డిజిటల్ సేవలను సులభంగా వినియోగించే విధానాలు కూడా రాష్ట్రాన్ని ప్రత్యేకంగా నిలబెట్టాయి.

అయితే ప్రభుత్వ యంత్రాంగం సమర్థవంతంగా పనిచేయడం ఒక్కటే సరిపోదు. ప్రజలు అప్రమత్తంగా ఉంటేనే సైబర్ నేరాలను సమర్థంగా అరికట్టవచ్చు. నేడు వాట్సాప్ ఇంపర్సనేషన్, ఫిషింగ్ లింక్స్, డిజిటల్ అరెస్ట్, ఇన్వెస్ట్‌మెంట్ స్కామ్స్, ఓటీపీ ఫ్రాడ్స్, ఏఐ వాయిస్ క్లోనింగ్ వంటి మోసాలు ఆందోళనకర స్థాయిలో పెరుగుతున్నాయి. బ్యాంకు వివరాలు, పాస్‌వర్డులు, ఓటీపీలను ఎవరికీ చెప్పకపోవడం, పెద్ద మొత్తాల లావాదేవీలకు ముందు సంబంధిత వ్యక్తితో నేరుగా ధృవీకరించుకోవడం, అనుమానాస్పద లింకులను తెరవకుండా ఉండటం వంటి సాధారణ జాగ్రత్తలే కోట్ల రూపాయల నష్టాన్ని నివారించగలవు.

సైబర్ భద్రతను కేవలం పోలీసు శాఖ బాధ్యతగా కాకుండా సమాజమంతా పంచుకోవాల్సిన బాధ్యతగా చూడాలి. పాఠశాలల నుంచి విశ్వవిద్యాలయాల వరకు, ప్రభుత్వ కార్యాలయాల నుంచి ప్రైవేట్ సంస్థల వరకు, ప్రతి స్థాయిలో సైబర్ లిటరసీ కార్యక్రమాలు నిర్వహించడం అత్యవసరం. సైబర్ నేరాలకు పాల్పడేవారిపై వేగవంతమైన దర్యాప్తు, ఫాస్ట్ ట్రాక్ కోర్టులు, కఠినమైన శిక్షలు, రాష్ట్రాల మధ్య సమన్వయం మరింత బలోపేతం కావాలి.

తెలంగాణ రూపొందించిన ఈ సమగ్ర సైబర్ సెక్యూరిటీ మోడల్ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలవాలి. ప్రతి రాష్ట్రం ఇలాంటి వ్యవస్థలను ఏర్పాటు చేసి, సాంకేతికతను సమర్థంగా వినియోగిస్తూ, ప్రజల్లో నిరంతర అవగాహన పెంపొందిస్తేనే దేశవ్యాప్తంగా సైబర్ నేరాలను గణనీయంగా తగ్గించడం సాధ్యమవుతుంది. సురక్షితమైన డిజిటల్ సమాజం, భద్రమైన ఆర్థిక వ్యవస్థ, ప్రజల్లో విశ్వాసం కలిగిన డిజిటల్ ఇండియా నిర్మాణానికి తెలంగాణ చూపిన మార్గాన్ని దేశమంతా అనుసరించాల్సిన అవసరం ఆసన్నమైంది.

# భారత ఇంధన భవిష్యత్తుకు కొత్త శక్తి- హరిత హైడ్రోజన్


(సి.హెచ్.ప్రతాప్)

వాతావరణ మార్పు ప్రభావం తీవ్రతరమవుతున్న వేళ, ఇంధన అవసరాలు వేగంగా పెరుగుతున్న సమయంలో, దిగుమతి చేసుకునే చమురు--సహజవాయువులపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాల్సిన భారత్‌కు హరిత హైడ్రోజన్ ఒక వ్యూహాత్మక అవకాశంగా అవతరిస్తోంది. ప్రపంచ దేశాలు శిలాజ ఇంధనాల నుంచి స్వచ్ఛమైన ఇంధన వ్యవస్థల వైపు మారుతున్న నేపథ్యంలో హైడ్రోజన్‌కు ప్రాధాన్యం పెరుగుతోంది. అయితే దీనిని కేవలం ‘భవిష్యత్తు ఇంధనం’గా పేర్కొనడం సరిపోదు. ఉత్పత్తి వ్యయం, విద్యుత్ అవసరం, నీటి లభ్యత, నిల్వ, రవాణా, భద్రత, మౌలిక వసతులు, మార్కెట్ డిమాండ్ వంటి అంశాలకు సమగ్ర పరిష్కారం లభించినప్పుడే హరిత హైడ్రోజన్ నిజమైన ఇంధన విప్లవానికి దారితీస్తుంది.

ముందుగా ఒక ప్రాథమిక విషయాన్ని గుర్తించాలి. హైడ్రోజన్ సహజంగా లభించే ప్రాథమిక ఇంధన వనరు కాదు; శక్తిని ఒక రూపంలో నిల్వ చేసి, అవసరమైన చోట మరో రూపంలో వినియోగించుకునే ‘శక్తి వాహకం’. బొగ్గు లేదా సహజవాయువు ఆధారంగా తయారయ్యే హైడ్రోజన్‌ను ‘గ్రే హైడ్రోజన్’ అంటారు. కార్బన్ ఉద్గారాలను పట్టుకుని నిల్వ చేసే సాంకేతికతను అనుసరిస్తే అది ‘బ్లూ హైడ్రోజన్’. ఇక సౌర, పవన వంటి పునరుత్పాదక విద్యుత్తును ఉపయోగించి నీటిని విద్యుద్విశ్లేషణ ద్వారా హైడ్రోజన్, ఆక్సిజన్‌లుగా విడదీసి తయారు చేసేదే హరిత హైడ్రోజన్. విద్యుత్తు పునరుత్పాదక వనరుల నుంచి వచ్చినప్పుడు ఉత్పత్తి ప్రక్రియలో కార్బన్ ఉద్గారాలు అత్యల్పంగా ఉంటాయి.

హరిత హైడ్రోజన్ తయారీలో ఎలక్ట్రోలైజర్ కీలక పరికరం. పునరుత్పాదక విద్యుత్తును ఉపయోగించి నీటిలోని హైడ్రోజన్, ఆక్సిజన్‌లను వేరు చేస్తారు. ఉత్పత్తైన హైడ్రోజన్‌ను శుద్ధి చేసి అధిక పీడన ట్యాంకుల్లో నిల్వ చేయవచ్చు. తక్కువ దూరాలకు కంప్రెస్డ్ గ్యాస్ ట్యాంకర్లు, అవసరమైన ప్రాంతాల్లో పైపులైన్లు ఉపయోగించవచ్చు. దీర్ఘదూర అంతర్జాతీయ రవాణాకు హైడ్రోజన్‌ను గ్రీన్ అమోనియా, మెథనాల్ వంటి హైడ్రోజన్ క్యారియర్లుగా మార్చి నౌకల ద్వారా తరలించడం ఆచరణాత్మక మార్గంగా అభివృద్ధి చెందుతోంది.

అయితే హైడ్రోజన్ అత్యంత తేలికైన వాయువు కావడం వల్ల దాని నిల్వ, రవాణా సాధారణ సహజవాయువుతో పోలిస్తే మరింత సంక్లిష్టం. లీకేజీ నియంత్రణ, అధిక పీడన భద్రత, పదార్థాల అనుకూలత, అగ్ని ప్రమాద నియంత్రణకు ప్రత్యేక ప్రమాణాలు అవసరం. కాబట్టి హైడ్రోజన్ ఆర్థిక వ్యవస్థ అంటే కేవలం ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చేయడం కాదు; వాటికి అనుసంధానంగా నిల్వ




కేంద్రాలు, పైపులైన్లు, పోర్టులు, పంపిణీ వ్యవస్థలు, భద్రతా మౌలిక వసతులను కూడా నిర్మించడం.

రిఫైనరీలు, ఎరువుల పరిశ్రమ, ఉక్కు, రసాయన రంగాలు హరిత హైడ్రోజన్‌కు తొలి ప్రధాన మార్కెట్లు. ముఖ్యంగా గ్రీన్ స్టీల్ తయారీలో బొగ్గు ఆధారిత ప్రక్రియలకు ప్రత్యామ్నాయంగా హైడ్రోజన్‌ను ఉపయోగించే అవకాశం ఉంది. భవిష్యత్తులో భారీ ట్రక్కులు, బస్సులు, రైళ్లు, నౌకాయానం వంటి అధిక శక్తి అవసరమయ్యే రంగాల్లోనూ దీని వినియోగం పెరగవచ్చు. హరిత హైడ్రోజన్ నుంచి తయారయ్యే గ్రీన్ అమోనియా, మెథనాల్ వంటి ఉత్పత్తులు అంతర్జాతీయ వాణిజ్యంలో కీలక పాత్ర పోషించే అవకాశముంది.

పీ.ఎన్.జీ.ఆర్.బీ. అధ్యయనాల ప్రకారం భారత్‌లో ప్రస్తుత హైడ్రోజన్ డిమాండ్ సుమారు 6--7 ఎం.టి.పీ.ఏ.గా ఉంది. ప్రధానంగా రిఫైనరీలు, అమోనియా--ఎరువుల పరిశ్రమలు దీనిని వినియోగిస్తున్నాయి. 2040 నాటికి దేశీయ డిమాండ్ సుమారు 16--18.5 ఎం.టి.పీ.ఏ.లకు చేరే అవకాశం ఉందని అంచనాలు సూచిస్తున్నాయి.

అయితే ప్రస్తుత హైడ్రోజన్ సరఫరాలో అధిక భాగం ఫాసిల్ ఇంధనాల ఆధారంగానే ఉంది. వాణిజ్య స్థాయిలో హరిత హైడ్రోజన్ ఇంకా ప్రారంభ దశలోనే ఉంది. ఐ.ఈ.ఏ. విశ్లేషణల ప్రకారం తక్కువ ఉద్గారాల హైడ్రోజన్ ప్రాజెక్టులు పెరుగుతున్నప్పటికీ, అధిక ఉత్పత్తి వ్యయం, డిమాండ్ అనిశ్చితి, మౌలిక వసతుల కొరత వంటి అంశాలు వేగాన్ని పరిమితం చేస్తున్నాయి.

ఈ అవకాశాలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 2023లో నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్‌ను ప్రారంభించింది. రూ.19,744 కోట్ల ప్రారంభ కేటాయింపుతో రూపొందిన ఈ మిషన్ 2030 నాటికి కనీసం 5 ఎం.టి.పీ.ఏ. హరిత హైడ్రోజన్ ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకుంది. దీనికి అనుసంధానంగా సుమారు 125 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్తు సామర్థ్యం అవసరమవుతుందని కేంద్రం అంచనా వేసింది.

మిషన్‌లోని సైట్ కార్యక్రమం ద్వారా ఎలక్ట్రోలైజర్ తయారీ, హరిత హైడ్రోజన్ ఉత్పత్తికి ఆర్థిక ప్రోత్సాహకాలు అందిస్తున్నారు. ఉక్కు, రవాణా, నౌకాయానం వంటి రంగాల్లో పైలట్ ప్రాజెక్టులు, హరిత హైడ్రోజన్ హబ్‌లు, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి, ప్రమాణాలు--ధృవీకరణ వ్యవస్థల అభివృద్ధికి కూడా మద్దతు ఇస్తున్నారు. 2030 నాటికి ఈ రంగంలో భారీ ప్రైవేట్ పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు ఏర్పడే అవకాశం ఉందని కేంద్రం అంచనా వేస్తోంది.

హరిత హైడ్రోజన్ రంగంలో చైనా భారీ స్థాయి తయారీ, తక్కువ వ్యయాల కారణంగా ముందంజలో ఉంది. ప్రపంచ ఎలక్ట్రోలైజర్ తయారీ సామర్థ్యంలో దాదాపు 60 శాతం చైనాలోనే ఉన్నట్లు ఐ.ఈ.ఏ. నివేదికలు సూచిస్తున్నాయి. యూరోపియన్ యూనియన్ కఠినమైన డీకార్బనైజేషన్ లక్ష్యాలతో పాటు దేశీయ ఉత్పత్తి, దిగుమతులకు ప్రోత్సాహం ఇస్తోంది. అమెరికా పన్ను ప్రోత్సాహకాల ద్వారా హరిత హైడ్రోజన్ ప్రాజెక్టులకు భారీ పెట్టుబడులను ఆకర్షిస్తోంది. జపాన్, దక్షిణ కొరియా దీర్ఘకాలిక దిగుమతి ఒప్పందాలు, హైడ్రోజన్ ఆధారిత సాంకేతికతలపై దృష్టి సారిస్తున్నాయి.

ఈ పోటీలో భారత్ బలం ప్రత్యేకమైనది. విస్తారమైన సౌరశక్తి వనరులు, తీరప్రాంతాలు, పెద్ద పారిశ్రామిక మార్కెట్, వేగంగా పెరుగుతున్న పునరుత్పాదక విద్యుత్తు సామర్థ్యం, నైపుణ్యమున్న మానవ వనరులు భారత్‌కు అనుకూలతలు. గుజరాత్, రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, ఒడిశా వంటి రాష్ట్రాల్లో పునరుత్పాదక విద్యుత్తు--పరిశ్రమలు--పోర్టులను అనుసంధానించే హరిత హైడ్రోజన్ హబ్‌లు అభివృద్ధి చేయవచ్చు.

అయితే అవకాశాల వెంట సవాళ్లను కూడా గుర్తించాలి. చౌకైన, స్థిరమైన పునరుత్పాదక విద్యుత్తు; నీటి నిర్వహణ; దేశీయ ఎలక్ట్రోలైజర్ తయారీ; నిల్వ--రవాణా మౌలిక వసతులు; దీర్ఘకాలిక కొనుగోలు ఒప్పందాలు; స్పష్టమైన భద్రతా ప్రమాణాలు; అంతర్జాతీయ ధృవీకరణ వ్యవస్థలు---ఇవన్నీ సమాంతరంగా అభివృద్ధి చెందాలి. నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో భారీ ప్రాజెక్టులు ఏర్పాటు చేస్తే స్థానిక నీటి భద్రతపై ఒత్తిడి పెరగకుండా శుద్ధి చేసిన వ్యర్థజలాలు, సముద్రజల డీశాలినేషన్ వంటి ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించాలి.

హరిత హైడ్రోజన్ భారత్‌కు కేవలం మరో ప్రత్యామ్నాయ ఇంధనం కాదు. ఇది ఇంధన భద్రత, దిగుమతుల తగ్గింపు, పారిశ్రామిక పోటీతత్వం, ఎగుమతులు, ఉపాధి, వాతావరణ బాధ్యతలను ఒకే దిశలో నడిపించగల వ్యూహాత్మక అవకాశం. 2030 నాటి లక్ష్యాలను చేరుకోవడమే అంతిమ గమ్యం కాకూడదు. పోటీ ధరలో ఉత్పత్తి, విశ్వసనీయ సరఫరా, దేశీయ డిమాండ్, అంతర్జాతీయ మార్కెట్, ప్రపంచస్థాయి సాంకేతిక సామర్థ్యాలను కలిపి భారత్ ఒక సమగ్ర హరిత హైడ్రోజన్ విలువ గొలుసును నిర్మించగలిగితే, రేపటి ప్రపంచ ఇంధన పటంలో దేశానికి ఒక కీలక స్థానాన్ని సొంతం చేసుకునే అవకాశం ఉంటుంది.

# ప్రజా సేవలో శ్రీ హనుమాన్ సేవా సమితి సంస్థ ప్రారంభం

**అనకాపల్లిలో (జయ జయహే)**



శారదా నగర్ హనుమాన్ దేవాలయం లో శ్రీ హనుమాన్ సేవా సమితి పేరుతో నూతనంగా సేవా సంస్థను ప్రారంభించారు ఆధ్యాత్మిక భావంతో హనుమంతుని సేవకులు భక్తులకు ప్రజలకు సేవా కార్యక్రమాలు చేయడమే ఈ సంస్థ యొక్క ముఖ్య ఉద్దేశం.అని అన్నారు కార్యక్రమానికి ముఖ్య అతిథి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మట్టి గణపతి ప్రచారకర్త వినాయక ఉత్సవ నిమజ్జనోత్సవ కమిటీ వ్యవస్థాపకులు ఆడారి కుమారస్వామి మాట్లాడుతూ హనుమంతుని ఆశయాలు అనుగుణంగా అతనికి ప్రీతికరమైన భజనలు సేవా కార్యక్రమం ప్రతి సంవత్సరం హనుమాన్ శోభాయాత్రను అనకాపల్లి జిల్లాలో ఐదువేలు మందితో అత్యంత ఘనంగా జరిపే విధంగా ఈ కమిటీ కృషి చేస్తుందని ఈ కమిటీ యొక్క పూర్తి బాధ్యతలు శ్రీ హనుమాన్ సేవా సమితి వ్యవస్థాపక చైర్మన్ ఆళ్ళ ప్రవీణ్ కుమార్ కీ భక్తులకు సూచనలు సలహా మేరకు మంచి కార్యక్రమాలు చేసే విధంగా పూర్తిస్థాయిలో కమిటీని భవిష్యత్తు ప్రణాళికలను తయారు చేయుటకు పూర్తి అధికారం చేపడతామని కమిటీ ఒక తీర్మానం చేయడం జరిగిందని తెలిపారు . ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక చైర్మన్ ఆళ్ళ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ 12 సంవత్సరాల క్రితం ఆడారి కుమారస్వామి మాకు అత్యంత సన్నిహితులు, అబ్దుల్ కలాం సేవా సంఘం స్థాపించడానికి ముఖ్యమైన వ్యక్తి అని ఆ కార్యక్రమం కూడా కుమారస్వామిగా చేతుల మీదగా ప్రారంభమై దిగ్విజయంగా 12 సంవత్సరాల పూర్తయింది ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి ప్రారంభించమని కోరడం జరిగిందని వారు మంచి మనసుతో చేసే ప్రతి కార్యక్రమానికి ఎంతోమంది వ్యక్తులు అనకాపల్లిలో తయారయ్యారని ఈ సంస్థ కూడా ఎంతో ఆధ్యాత్మిక సంస్థగా భక్తులకు ప్రజలకు ఎంతో సహకారంగా తోడుగా ఉండాలని నిత్యం ఆధ్యాత్మిక భావంతోనే కార్యక్రమాలు చేపడతామని తెలిపారు

# విద్యార్థులలో సృజనాత్మకత వెలికితీయటమే "జెసిశాట్"

**జేసి తమ్మినేని.ఉషరాణి**

**శ్రీకాకుళం. (జయ జయహే )**




విద్యార్థులలో సృజనాత్మకత వెలికితీయటమే "జెసిశాట్" ముఖ్య ఉద్దేశ్యమని, జేసిఐ శ్రీకాకుళం మెయిన్ అధ్యక్షురాలు తమ్మినేని.ఉషరాణి అన్నారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల దరిలోగల వికాస్ హై స్కూల్ లో విద్యార్థులకు స్కాలర్‌షిప్, ఆప్టిట్యూడ్ టెస్ట్ ను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసి తమ్మినేని.ఉషరాణి మాట్లాడుతూ జేసీఐ స్కాలర్‌షిప్, ఆప్టిట్యూడ్ టెస్ట్ అనేది 6వ తరగతి నుండి 12వ తరగతి వరకు చదివే విద్యార్థులకు, జెసిఐ ఇండియా నిర్వహించే, ఒక జాతీయ స్థాయి ప్రతిభాన్వేషణ స్కాలర్‌షిప్ అని, విద్యార్థులను గణితం, సైన్స్, ఇంగ్లీష్, జనరల్ నాలెడ్జ్, ఐక్యూలలో మూల్యాంకనం వంటివాటిపై అవగాహన వస్తుందన్నారు. అలాగే విద్యార్థులను ప్రోత్సహించి, స్కాలర్‌షిప్, ఆప్టిట్యూడ్ టెస్ట్ లో పాల్గొనేలా అవగాహన కల్పిస్తూ, పరీక్షవేదికను అందించిన, వికాస్ హై స్కూల్ యాజమాన్యానికి ప్రత్యేక ధన్యవాదాలన్నారు. అనంతరం అడ్వైజర్ మణిశర్మ మాట్లాడుతూ జూనియర్ ఛాంబర్ ఆఫ్ ఇంటర్నేషనల్ సూచనల మేరకు, శ్రీకాకుళం జిల్లాలో, జెసిఐ శ్రీకాకుళం వ్యవస్థాపకులు డా. జామి.భీమశంకర్ నేతృత్వంలో విద్యార్థులకు ఈ రోజు స్కాలర్‌షిప్, ఆప్టిట్యూడ్ టెస్ట్ నిర్వహించామని, ప్రతిభగల విద్యార్థులను గుర్తించి, వారికి నగదు ప్రోత్సాహాన్ని అందించాలనే ఈ కార్యక్రమం ఉద్దేశ్యమన్నారు. ప్రతీ విద్యార్థి పోటీతత్వం అలవాటు చేసుకుంటే, భవిష్యత్ ఆశాకిరణమౌతారని, ప్రతిభకనబరిచే విద్యార్థికి లక్ష రూపాయల బహుమతి అందించనున్నామన్నారు. నిత్య సేవకురాలు ఎఎస్ఐ అరుణ కుమారి మాట్లాడుతూ జెసిఐ శ్రీకాకుళం మెయిన్ సేవలు యువతకు చాలా అవసరమని, ముఖ్యంగా నేటితరం విద్యార్థులకు ఉపయోగకరమని, రానున్న తరానికి జెసిఐ శ్రీకాకుళం మెయిన్ కీలకం కానుందన్నారు.



# ఇంటింటా రెండేళ్ల నమ్మకం.. అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమం

**ప్రభుత్వ సంక్షేమాన్ని ప్రజలకు వివరిస్తున్న బూరుగుపల్లి**

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి :**

నిడదవోలు పట్టణ టీడీపీ అధ్యక్షులు కొమ్మిన వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్ ఁ నిడదవోలు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ బూరుగుపల్లి శేషారావు ఇంటింటా పర్యటించి కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ సూపర్ సిక్స్ పథకాలు అందించిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని శేషారావు అన్నారు. రైతుల పక్షపాతిగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, యూరియా కొరత లేకుండా రైతులకు సరఫరా చేస్తున్నామని తెలిపారు.గత ప్రభుత్వం విధ్వంసం సృష్టిస్తే కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తోందని అన్నారు. డీఎస్సీ నిర్వహించి అర్హులకు ఉద్యోగాలు కల్పించిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు.డీఎస్సీ నియామకాలు జరిగి ఏడాది తర్వాత వైకాపా ఉద్యమాలు చేయడం సిగ్గుచేటని విమర్శించారు. దొంగ ఉద్యమాలు మానుకుని ప్రజా సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలని వైకాపాకు బూరుగుపల్లి శేషారావు సూచించారు.

# డా ఎం.పి పరమేశ్వరన్ మృతి తీరని లోటు

**వల్లం రెడ్డి లక్ష్మణ రెడ్డి**

**గుంటూరు (జయ జయహే)**



అణు శాస్త్రవేత్తగా, ప్రజా సైన్స్ ఉద్యమ నేతగా, అక్షరాస్యత ఉద్యమ రూపశిల్పిగా, కేరళ రాష్ట్రంలో 100 శాతం అక్షరాస్యత సాధనకు కృషి చేసిన మహనీయులు డా॥ యం.పి. పరమేశ్వరన్ అనారోగ్యంతో తన 91 వ ఏట కేరళలోని త్రిసూల్ లో పరమపదించడం పట్ల జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ఒక ప్రకటనలో ప్రగాఢ సంతాపం తెలియజేశారు. 1990వ దశాబ్దంలో ఆంధ్రప్రదేశ్ లో జరిగిన సంపూర్ణ అక్షరాస్యత ఉద్యమానికి, మద్య నిషేధ ఉద్యమానికి డా॥ యం.పి. పరమేశ్వరన్ ప్రేరణగా నిలిచారు. 1956 నుండి 1975 వరకు బొంబాయి లోని బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ లో అణు శాస్త్రవేత్తగా కృషిచేసి,శాస్త్రీయ విజ్ఞానాన్ని సామాన్య ప్రజల చెంతకు చేర్చి ప్రజల్లో విజ్ఞాన తృష్ణను పెంపొందించడానికి కేరళ శాస్త్ర సాహిత్య పరిషత్ ను బలోపేతం చేసిన మహనీయుడని కొనియాడారు. కేరళ రాష్ట్రంలో వికేంద్రీకరణ కోసం కృషి చేశారని ప్రజాప్రణాళికలు , సూక్ష్మ ప్రణాళికలకు ప్రేరణగా నిలిచారని తెలిపారు. కేరళ రాష్ట్రంలో మూడవ అత్యున్నత పురస్కారం అయిన కేరళ శ్రీ అవార్డును 2022 లో కేరళ ప్రభుత్వం నుండి పొందినారు. 30 కి పైగా పుస్తకాలను, 300 పైగా వ్యాసాలను రచించి ప్రజలను జాగృతులను చేశారు. డా॥ యం.పి. పరమేశ్వరన్ భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆయన వెలిగించిన అక్షర జ్యోతులు, పెంచిన వైజ్ఞానిక దృక్పథం ఎప్పటికీ ఆరిపోదు. ఆయన సిద్ధాంతాలను, ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే మనం ఆయనకు అర్పించే నిజమైన నివాళి.



# రైతులకు యూరియా పంపిణీ

**పాయకరావుపేట జయ జయహే ఆగస్ట్ 11**

శ్రీరాంపురంలో మంగళవారం రైతులకు యూరియా పంపిణీ చేశారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు చింతలపు ప్రదీప్ (పద్దు), శ్రీరాంపురం పిఏసిఎస్ చైర్మన్ చిక్కాల శ్రీనివాసరావు రైతులకు యూరియా అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు కురందాసు రమణ, ఐటిడిపి మండల అధ్యక్షులు బొలిశెట్టి నాగేశ్వరరావు, మందపాటి శ్రీనివాసరాజు, బల్ల బెనర్జీ, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.



# విరిగిన విద్యుత్ స్తంబాలు..

**పునరుద్ధరించిన ఏఈ..**

**కొయ్యురు (జయ జయహే ) న్యూస్ ఆగష్టు 12,**

అల్లురి జిల్లా కొయ్యూరు మండలం బంగారంపేట పంచాయతీ పరిధిలోని గుమ్మలపాలెం గ్రామంలో ఐదు విద్యుత్ స్తంభాలు విరిగిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈ విషయాన్ని మాజీ సర్పంచ్ సుర్ల చంద్రరావు విద్యుత్ శాఖ ఏఈ పి. నాగ సతీష్ దృష్టికి ఫోన్ ద్వారా తీసుకెళ్లారు. సమాచారం అందిన వెంటనే స్పందించిన ఏఈ పి. నాగ సతీష్ ఘటన స్థలానికి చేరుకుని, దగ్గరుండి విద్యుత్ సిబ్బందితో ఐదు కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయించారు. అనంతరం విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులను స్వయంగా పర్యవేక్షిస్తూ రాత్రి 10 గంటల వరకు అక్కడే ఉండి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ప్రజల సమస్యపై వెంటనే స్పందించి, దగ్గరుండి విద్యుత్ స్తంభాలను వేయించి మా గ్రామంలో వెలుగు నింపిన విద్యుత్ శాఖ అధికారులకు కృతజ్ఞతలు అని మాజీ సర్పంచ్ తో పాటు గ్రామస్తులు తెలిపారు.




# గంజాయి అక్రమ రవాణాపై ఉక్కు పాదం

**అనకాపల్లి జయ జయహే**


కసింకోట గ్రామ హైవాలో గంజాయి అక్రమంగా తరలిస్తున్నట్టుగా పోలీసులకు సమాచారం అందడంతో పోలీసులు పోలీసులు చెకింగ్ చేయగా గంజాయితో పట్టుబడడం జరిగింది దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కసింకోట ఎన్ హెచ్ ఫైవ్ 16, హోప్ హోటల్ ఎదురుగా పోలీసులు హైవేలో వాహనాలు తనిఖీలు చేస్తుండగా అనుమానస్పదంగా వచ్చిన ఒక ఆటో మరియు రెండు ద్విచక్ర వాహనాలు పోలీసులు తనిఖీ చేయగా ఆటో వెనుక భాగంలో రెండు గోనె సంచుల్లో దాచిన 30 ప్యాకెట్ లో 60 కేజీల గంజాయి ఉన్నట్లు పోలీసులు గుర్తించడం జరిగింది . గంజాయి పోలీసులకు దొరికిపోవడంతో నిందితులు అక్కడ నుండి పారిపోవడానికి ప్రయత్నించగా పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించే నలుగురు నిందితులను అదుపులోకి తీసుకోవడం జరిగింది ఒక వ్యక్తి కళ్ళుగప్పి అక్కడనుండి పరారు కావడం జరిగింది పట్టుబడిన గాడి రత్నం రాజు 28 సంవత్సరాలు కాకినాడ జిల్లా,గోబేరు వెంకట చైతన్య 34 సంవత్సరాలు రాజమండ్రి,, గుంత హిమాన్సు శేఖర్ జోష్ 22 సంవత్సరాల ఒడిస్సా కోరాపోట్ జిల్లా, కారా కేసరి కొర్ర కిషోర్ 32 సంవత్సరాలు కోరాపట్ జిల్లా ఒడిస్సా, వీరు నలుగురిని పోలీసుల అదుపులోకి తీసుకోవడం జరిగింది విచారణ దర్యాప్తుల లో ప్రధాన నిందితుడు గాడి రత్నం రాజు అరకు ప్రాంతం నుంచి సుమారు 60 కేజీలు గంజాయి కొనుగోలు చేసి రాజమండ్రి తరలించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు కసింకోట సీఐ స్వామినాయుడు పర్యవేక్షణలో ఎస్సై లక్ష్మణరావు ఏఎస్ఐ శ్యాంసుందర్ హెచ్ జి. డీ.ఎస్ బాబు తదితర సిబ్బంది చురుకుగా పాల్గొని సమన్వయంతో వాహనాలు తనిఖీలు నిర్వహించి గంజాయి అక్రమ రవాణాను భగ్నం చేయడం జరిగింది . ఈ కేసులో ఏఎస్ఐ శ్యాంసుందర్ మరియు హెచ్. జి. డీఎస్ బాబు చేసిన సమర్థవంతమైన సేవలకు గాను జిల్లా ఎస్పీ ప్రత్యేక నగదు బహుమతి మరియు ప్రశంసా పత్రం అందించి అభినందించారు 1985 కింద కేసు నమోదు చేసి పలు సెక్షన్ల కేసులు పెట్టి దర్యాప్తు కొనసాగిస్తున్నారు



# జిల్లాస్థాయి చెడుగుడు పోటీల్లో రామిరెడ్డి పాలెం ప్రధమ స్థానం

**మునగపాక, ఆగస్టు 11, జయ జయహే:**

మునగపాక మండల కేంద్రం మునగపాకలో గల రాష్ట్ర స్థాయి సేవా యువజన సంస్థ గ్రామీణ యువజన మందిరం 62వ వార్షికోత్సవ సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి చెడుగుడు పోటీల్లో రామిరెడ్డి పాలెం జట్టు ప్రథమ స్థానం, చూచుకొండ జట్టు ద్వితీయ స్థానం, మునగపాక జట్టు తృతీయ స్థానం బహుమతులు గెలుచుకున్నాయి. ఆది, సోమవారాల్లో ఈ పోటీలు జరిగాయి. ఈ పోటీలకు శరగడం రాము, పెంటకోట శ్రీనివాస్, వెలగ రామకృష్ణ రిఫరీలుగా వ్యవహరించారు. గ్రామీణ యువజన మందిరం అధ్యక్షుడు ఆడారి శ్రీకాంత్, కార్యవర్గ సభ్యులు మల్ల జోగారావు, ఆడారి కాశి బాబు, దాడి అప్పలనాయుడు, మల్ల రామ జగన్నాథం తదితరులు ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. చెడుగుడు పోటీ విజేతలకు శ్రీధర్మ ఫౌండేషన్ చైర్మన్ కర్రి సాయికృష్ణ 30000 రూపాయలు విరాళం ప్రకటించారు.



# ఎస్ఐఆర్‌పై రాజకీయ పార్టీలతో సమావేశం

**రాజమహేంద్రవరం:**
**జయ జయహే: ఆగస్టు 11**

:ధవళేశ్వరం గ్రామీణ మండల రెవెన్యూ అధికారి కార్యాలయంలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా పునర్విమర్శ పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితా పరిశీలన, అర్హులైన ఓటర్ల పేర్ల నమోదు, అనర్హులు లేదా డూప్లికేట్ పేర్ల గుర్తింపు, చిరునామా మార్పులు తదితర అంశాలపై చర్చించారు. రాజకీయ పార్టీలకు చెందిన బూత్ లెవల్ ఏజెంట్లు తమ పరిధిలోని ఓటర్ల జాబితాను పరిశీలించి, అభ్యంతరాలు ఉంటే సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనల ప్రకారం పూర్తి చేయడంలో అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని అధికారులు కోరారు. ఈ సమావేశ కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, చెల్లి బోయిన వేణుగోపాలకృష్ణ, ఎమ్మార్వో, ఎండిఓ, సిఐ గణేష్,టిడిపి నాయకులు మచ్చెట్టి ప్రసాద్, బిజెపి నాయకులు,ఇతర అధికారులు పాల్గొన్నారు

# స్కూటీపై 14 కేజీల గంజాయి తరలింపు.. ఇద్దరి అరెస్ట్


**దుంబ్రిగూడ: ఆగష్టు,11 జయ జయహే.**



అల్లూరి సీతారామరాజు జిల్లా దుంబ్రిగూడ మండలం కిల్లోగూడ జంక్షన్ వద్ద 14 కేజీల గంజాయిని తరలిస్తున్న ఇద్దరిని పోలీసులు పట్టుకున్నారు. హోండా యాక్టివా స్కూటీపై గోనే సంచిలో గంజాయిని తరలిస్తుండగా దుంబ్రిగూడ ఎస్ఐ ఎల్. సురేష్ తన సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు.పోలీసుల వివరాల ప్రకారం.. అరెస్టయిన వారిలో విశాఖపట్నం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జాలారిపేటకు చెందిన వాసుపల్లి పృధ్వి ఉండగా, మరో వ్యక్తి విజయనగరం జిల్లా ధర్మవరం, ఎస్.కోట ప్రాంతానికి చెందిన జువెనైల్‌గా పోలీసులు గుర్తించారు.వాసుపల్లి పృధ్విపై గతంలోనూ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. గతంలో విశాఖపట్నం సెంట్రల్ జైలులో ఉన్న సమయంలో ఒడిశా రాష్ట్రానికి చెందిన ఓ వ్యక్తితో పరిచయం ఏర్పడిందని, జైలు నుంచి విడుదలైన అనంతరం అతని వద్ద నుంచి గంజాయిని తీసుకుని విశాఖపట్నానికి తరలిస్తున్నట్లు విచారణలో వెల్లడైనట్లు పేర్కొన్నారు.విశాఖపట్నం వన్‌టౌన్ పరిధిలోని హార్బర్, పోర్టు ప్రాంతాల్లో గంజాయిని చిన్న చిన్న పొట్లాలుగా చేసి విక్రయించడం ద్వారా అధిక మొత్తంలో డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో గంజాయిని తరలిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలినట్లు సమాచారం.ఈ కేసులో గంజాయిని సరఫరా చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న పాడువా లెంజిగూడ గ్రామానికి చెందిన పాంగి హరిని కూడా పోలీసులు ఆగస్టు 11 మంగళవారం నాడు అరెస్టు చేశారు. గంజాయి అక్రమ రవాణా కేసులో అరెస్టయిన ఇద్దరు నిందితులను రిమాండ్ నిమిత్తం విశాఖపట్నం సెంట్రల్ జైలుకు తరలించగా, జువెనైల్‌ను చిల్డ్రన్ హోమ్‌కు పంపినట్లు పోలీసులు తెలిపారు. కేసుపై తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది.

# రాజుగారి బీడులో దొంగలు పడ్డారు

**పాయకరావుపేట జయ జయహే ఆగస్ట్ 11**





రాజుగారి బీడులో ఆదివారం అర్ధరాత్రి దొంగలు పడ్డారు. విలువైన బంగారు ఆభరణాలు, మోటారు సైకిల్ ఎత్తుకుపోయారు. వివరాలిలా ఉన్నాయి... పాయకరావుపేట రాజుగారి బీడుకు చెందిన బాధితుడు రామ్మోహన్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి స్వగ్రామమైన విజయవాడ వెళ్లి తిరిగి ఈ నెల 10 న ఇంటికి రాగా ఇంటి మెయిన్ గేట్, ఇంటి లోపల తలుపులు తెరచిఉన్నాయి. బెడ్ రూమ్ లోపల ఉన్న బీరువా తాళములు ఎవరో గుర్తు తెలియని దొంగలు పగలగొట్టి బీరువా అరలో ఉన్న సుమారు 88 గ్రాములు బరువు గల బంగారు ఆభరణాలు, ఇంటి వరండాలో ఉన్న ఏపీ 16 ఈసీ 6878 నెంబర్ గల మోటార్ సైకిల్ దొంగిలించుకుని పోయినట్లు గుర్తించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. సిఐ ఎం వినోద్ బాబు ఆదేశాల మేరకు ఎస్ఐ జె పురుషోత్తం కేసు నమోదు చేసి క్లూస్ టీం రప్పించి దర్యాప్తు ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐ వినోద్ బాబు మాట్లాడుతూ. పాయకరావుపేటలో ఎవరైనా సొంత పని నిమిత్తం ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్ళిన ఎడల ఏ తేదీ నుండి ఏ తేదీ వరకు వెళుచున్నది వివం- ములు పోలీస్ స్టేషన్లో తెలియపరిచిన ఎడల రాత్రి బీటు సిబ్బంది వారి ఇంటి ఏరియాలో ఎటువంటి నేరములు జరగకుండా గస్తీ తిరుగుతారని చెప్పారు. ఇంటికి తాళం వేసి ఎక్కడికైనా వెళితే ఇంటిలో విలువైన సామాన్లు అనగా బంగారు, వెండి వస్తువులు, నగదు ఎట్టి పరిస్థితుల్లోను ఇంటి లోపలఉంచవద్దన్నారు. ఇంటి వద్ద రాత్రి లేదా పగటి సమయంలో చుట్టుపక్కల పరిసర ప్రాంతాలలో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు, కొత్త వ్యక్తులు కనిపిస్తే వెంటనే సిఐ 9440796106, ఎస్ఐ 9347633643 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం తెలియజేయాలని చెప్పారు.

# ఉచిత జర్మన్ లాంగ్వేజ్ శిక్షణకు దరఖాస్తు చేసుకోండి


**మాడుగుల ఆగస్టు 11 జయ జయహే**



జర్మనీలో మహిళా నర్సింగ్ ఉద్యోగాల్లో చేరేందుకు అర్హులైన మహిళ నర్సింగ్ అభ్యర్థులు ఉచిత జర్మన్ లాంగ్వేజ్ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ అనకాపల్లి జిల్లా అధికారి రోహిణి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ ఈ శిక్షణకు జి ఎన్ ఎం, బిఎస్సి నర్సింగ్ పూర్తి చేసిన 35 ఏళ్ల లోపు గల మహిళ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సుమారు 8 నుంచి 10 మాసాలపాటు ఎంపికైన అభ్యర్థులకు తిరుపతి గుంటూరు విశాఖపట్నంలో శిక్షణ తరగతులు నిర్వహిస్తారన్నారు. శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులకు వారి అర్హతను బట్టి రెండు లక్షల 75 వేల నుంచి మూడు లక్షల 30 వేల రూపాయల వరకు జీతం లభిస్తుందన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 31 లోగా హెచ్ టిటిపిఎస్:// నైపుణ్యం.ఏపీ.జీవో వి. ఐ ఎన్ వెబ్సైట్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

# గ్యాస్ ఈకేవైసీకి నాలుగు రోజులే గడువు

**చోడవరం ఆగస్టు 11 జయ జయ హే**



భారత ప్రభుత్వం ఎల్పిజి వినియోగదారుల ఈ కేవైసీ పూర్తి చేయడానికి 15 ఆగస్టును చివరి తేదీగా నిర్ణయించిందనీ చోడవరం హెచ్.పీ గ్యాస్ పుష్కల ఏజెన్సీ యజమాని విజయబాబు మంగళవారం తెలిపారు. ప్రభుత్వ విధించిన బడుగుకో ఇక నాలుగు రోజులే మిగిలి ఉందన్నారు. కాబట్టి ఇప్పటికీ ఈ.. కేవైసీ పూర్తి చేయని వినియోగదారులు వెంటనే పూర్తి చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గడువు తర్వాత ప్రభుత్వం అమలు చేసే నిబంధనల ప్రకారం ఈ.. కేవైసీపూర్తి చేయని కనెక్షన్లకు సేవల్లో అంతరాయం కలగవచ్చు , కమర్షియల్ ధరలకే సిలిండర్ పొందాల్సిన పరిస్థితి రావచ్చన్నారు. మీకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉండేందుకు, దయచేసి మీ హెచ్.పీ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ కార్యాలయాన్ని లేదా డెలివరీ బాయ్ ని వీలైనంత త్వరగా సంప్రదించి ఈ కేవైసీ పూర్తి చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే 80 శాతం ఈ..కేవైసీ పూర్తయిందన్నారు.



## ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో

# జ్ఞాన జ్యోతి శిక్షణ

**పాయకరావుపేట జయ జయహే ఆగస్ట్ 11**

పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం అంగన్వాడీ టీచర్స్ కు ఆరు రోజులుపాటు జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి జి రమేష్ బాబు హాజరయ్యారు. ఈ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు జాన్ ప్రసాద్ ప్రారంభంచారు. ప్రి ప్రైమరీ పిల్లలలో అన్ని రకాలుగా అభ్యాసనలో సమగ్ర అభివృద్ధి చెందేలా అంగన్వాడీ టీచర్స్ కృషి చేయాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్, అంగన్వాడీలో విద్యార్థుల సర్వోతోముఖాభివృద్ధికి అంగన్వాడీ టీచర్స్ కృషి చేయాలని శిక్షణలో వివరించారు. ఈ కార్యక్రమంలో మండల రిసోర్స్ పర్సన్లు హరికృష్ణ, శ్రీను, సతీష్, లలిత, రంజాన్ బీబీ మరియు మండలంలో అన్ని అంగన్వాడీ టీచర్స్ పాల్గొన్నారు.





## శేషగిరి హాస్పిటల్ ఆధ్వర్యంలో

# ఉచిత వైద్య శిబిరం

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి:**

శేషగిరి హాస్పిటల్ ఆధ్వర్యంలో దారవరం గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆర్థోపెడిక్, కార్డియాలజీ, గైనకాలజీ, జనరల్ మెడిసిన్ విభాగాల నిపుణులు పాల్గొని ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి వైద్య సలహాలు, సూచనలు అందించడంతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామం, పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై వైద్య సేవలను వినియోగించుకున్నారు. డాక్టర్ తోపరాల కళ్యాణ్ చక్రవర్తి ఆధ్వర్యంలో ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మాజీ మండల అధ్యక్షులు బొడ్డు రాజు, జనరల్ సెక్రెటరీ బొడ్డు కేశవ్, గ్రామ పార్టీ అధ్యక్షులు కరుటూరి శివరామకృష్ణ, టీడీపీ నాయకులు బడ్డు వీరేంద్ర చౌదరి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# మాడుగులలో శాకంబరీ ఉత్సవాలు

**మాడుగుల ఆగస్టు 11 జయ జయహే**

ఆషాడ శుద్ధ చతుర్దశి మంగళవారం పురస్కరించుకొని మాడుగుల మోదకొండమ్మ అమ్మవారి ఆలయంలో శాకాంబరి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని వివిధ రకాల కూరగాయలు పళ్ళు ఆకుకూరలతో అలంకరించారు. ఆషాడమాసంలో అమ్మవారిని శాకంబరీ అవతారంలో దర్శించుకుంటే ఎంతో పుణ్యఫలమనీ భావిస్తారు. దాన్లో భాగంగా మోదకొండమ్మ అమ్మవారిని శాకంబరీ మాతగా తయారుచేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ఉత్సవానికి అనేకమంది భక్తులు శాకంబరి అమ్మవారి దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పుప్పాల అప్పలరాజు, సభ్యులు ఎస్ శ్రీనివాసరావు జిహెచ్ పైడినాయుడు ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# చోడవరంలో ప్రారంభమైన జ్ఞాన జ్యోతి శిక్షణ

**చోడవరం,ఆగస్టు 11,జయ జయ హే**

చిన్నారుల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా అంగన్వాడి కార్యకర్తలు కి మూడు రోజుల పాటు నిర్వహించతలపెట్టిన జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది.స్తానిక జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో ఐ సి డి ఎస్ ఆధ్యర్యంలో మండలం లో గల 76 మంది కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్నారు.ఆరేళ్ల లోపు చిన్నారుల్లో సమగ్ర అభివృద్ధి గురించి పలు అంశాలపై ఈ శిక్షణ ఇస్తున్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు శాంతిప్రియ,సురేష్,గణేష్,ప్రశాంత్ శిక్షణ ఇస్తున్నారు.




# సుగర్స్ రైతులు కార్మికుల బకాయిలు చెల్లించాలంటూ ఆమ్ ఆద్మీ దీక్షలు

**చోడవరం ఆగస్టు 11 జయ జయహే**

ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో గోవాడ సుగర్ ఫ్యాక్టరీ పరిధిలోగల రైతులకు, కార్మికులకు బకాయిలు చెల్లించాలని చోడవరం రెవెన్యూ కార్యాలయం పక్కన నిరాహార దీక్ష కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మంగళవారం నాటికి రిలే నిరాహార దీక్ష నాలుగో రోజు కు చేరుకుంది. ఈ సందర్భంగా ఆమ్ ఆద్మీ అనకాపల్లి జిల్లా కన్వీనర్ హరనాథ్ బాబా మాట్లాడుతూ రైతులకు కార్మికులకు బకాయిలు చెల్లించేందుకు ఫ్యాక్టరీ పరిధిలో గల చోడవరం మాడుగుల నర్సీపట్నం అనకాపల్లి పాయకరావుపేట ఎమ్మెల్యేలు జిల్లా కలెక్టర్ తో కలసి ముఖ్యమంత్రితో చర్చించాలని కోరారు. ఫ్యాక్టరీ పరిధిలో గల రైతులకు,కార్మికులకు 24 నెలలుగా కార్మికులు, రైతులు బకాయిలు అందక ఎంతో బాధ పడుతున్నారని ఇన్ని నెలలపాటు కార్మికులను రైతులను ఇబ్బంది పెట్టడం మంచిది కాదని అన్నారు. త్వరలోనే ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రైతులకు కార్మికులకు బకాయిలు చెల్లించకపోతే వారి వద్దకు వెళ్లి ఓటు వేయమని అడగడం సిగ్గుగా ఉంటుందని ముఖ్యమంత్రి కి వివరించాలన్నారు. నాలుగో రోజు నిరాహార దీక్ష శిబిరంలో అనకాపల్లి జిల్లా ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ కొణతాల హరినాథ్ బాబు, చోడవరం నియోజకవర్గం ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ వేగి వరలక్ష్మి నాయుడు, శనివాడ నూకరాజు పొలుమూరి నానాజీ దాట్ల వెంకటేశ్వరరావు ముత్యాల నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.



## పచ్చి కొబ్బరిని వాడితే.. బ్యూటీ పార్లర్‌కు వెళ్లాల్సిన అవసరమే ఉండదు

కొబ్బరితో ఎన్నో రకాల రుచికరమైన వంటలను తయారుచేసుకోవచ్చు. ఎక్కువగా ఇది దక్షిణ భారతదేశంలో వాడుతుంటారు. ప్రతీ వంటకాల్లోను కొబ్బరిని ఉపయోగిస్తుంటారు. అందువల్ల అక్కడ ప్రతీ ఒక్కరు అందంగాను, యవ్వనంగాను కనిపిస్తుంటారు. అయితే కొబ్బరిని సాధారణంగా అయితే కొబ్బరి చట్నీ, సాంబార్, కొబ్బరి అన్నం, కొబ్బరి స్వీట్ వంటి రకరకాల పదార్థాలను తయారుచేసుకుని ఆస్వాదిస్తుంటారు అని మాత్రమే తెలుసు. అంతేకాదు కొబ్బరిని పొడిగా చేసుకుని ప్రతీ వంటల్లోను ఉపయోగిస్తే ఎంతో రుచికరమైన ఆహారాన్ని తినవచ్చు.
అయితే పచ్చి కొబ్బరితో ఆరోగ్యానికి పుష్కలమైన ప్రయోజనాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఆరోగ్యంతో పాటు చర్మ సౌందర్యాన్ని కూడా కాపాడుకోవచ్చని కూడా అంటున్నారు. కొబ్బరిలో ఫైబర్, విటమిన్ సి, ఈ, బి, ఐరన్, కాల్షియం, ఫాస్పరస్, మినరల్స్ వంటివి పుష్కలంగా ఉంటాయి. ఇవి ఆరోగ్యానికి మాత్రమే కాదు చర్మ సౌందర్యాన్ని కూడా రక్షిస్తాయి.
పచ్చి కొబ్బరి జీవక్రియను కూడా మెరుగుపరుస్తుంది. ఇది మలబద్ధకం వంటి సమస్యలను కూడా దూరం చేస్తుంది. కొబ్బరిలో ఉండే విటమిన్లు, మినరల్స్ జుట్టును ఆరోగ్యంగా ఉంచడంతో పాటు చర్మాన్ని కూడా యవ్వనంగా కనిపించేలా చేస్తాయి. ముఖ్యంగా వయసు మీద పడుతున్న వారికి ఇది ఓ అద్భుతమైన ఔషధంలా పనిచేస్తుంది. చర్మంపై ముడతలు, మచ్చలు వంటి వాటిని తొలగించేందుకు తోడ్పడుతుంది. కొబ్బరిలో పుష్కలమైన విటమిన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు, ఖనిజాలు వంటి ఉండడం వల్ల ఇవి బరువును తగ్గించుకోవడానికి కూడా సహాయడపతాయి. అందువల్ల తరచూ కొబ్బరిని ఆహారంలో చేర్చుకోవడం వల్ల ఆకలిని తగ్గించి బరువు నియంత్రిస్తుంది. అధిక కేలరీలు తీసుకోవడం వంటి వాటిని కూడా నిరోధిస్తుంది.
కొబ్బరి కేవలం చర్మ సౌందర్యానికి మాత్రమే కాకుండా అనారోగ్య సమస్యలకు కూడా ఎంతగానో సహాయపడుతుంది. అందులో ముఖ్యంగా ప్రస్తుతం ఎదుర్కుంటున్న గుండె సమస్యలకు అద్భుతంగా పనిచేస్తుంది. గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో సహాయపడుతుంది. మంచి కొలస్ట్రాల్ పెంచి, చెడు కొలస్ట్రాల్ ను తగ్గిస్తుంది. పచ్చి కొబ్బరిలో యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ సి ఉండడం వల్ల రోగనిరోధక వ్యవస్థలను బలపరుస్తుంది. అంతేకాదు ఇందులో ఉండే కాల్షియం, పొటాషియం ఎముకలను బలోపేతం చేసేందుకు సహాయపడతాయి.

# గ్రామీణాభివృద్ధి లక్ష్యాల్లో ప్రజాప్రతినిధులదే కీలక పాత్ర

**- వికసిత్ భారత్ - జీ రామ్ జీ చట్టం అమలు బాధ్యత స్థానిక సంస్థలదే**

**- స్థానిక ప్రజాప్రతినిధుల శిక్షణ సదస్సులో జడ్పీ చైర్పర్సన్ జె. సుభద్ర**

**అనకాపల్లి, ఆగస్టు 11, జయ జయహే**

గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల సమర్థ అమలు, స్థానిక సంస్థల బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారం, గ్రామాల సమగ్ర అభివృద్ధి, సహజ వనరుల సంరక్షణలో ప్రజాప్రతినిధులు కీలక పాత్ర పోషించాలని జిల్లా పరిషత్ ఛైర్పర్సన్ జె. సుభద్ర పేర్కొన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, స్పెషల్ ఆఫీసర్లకు నిర్వహించిన వన్–డే శిక్షణ సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌ల ద్వారా అమలవుతున్న వికసిత్ భరత్ – జీ రామ్ జీ చట్టంపై ప్రజాప్రతినిధులు సమగ్ర అవగాహన కలిగి ఉండాలని సూచించారు. గ్రామీణ కుటుంబాల నమోదు, గ్రామీణ రోజ్‌గార్ గ్యారంటీ కార్డుల జారీ, ఉపాధి దరఖాస్తుల స్వీకరణ, వికసిత గ్రామ పంచాయతీ ప్రణాళిక రూపకల్పన, వార్షిక కార్యాచరణ ప్రణాళికల తయారీ, పనుల అమలు, పర్యవేక్షణ వంటి అంశాల్లో గ్రామ పంచాయతీల పాత్ర అత్యంత కీలకమని వివరించారు. ఒంటరి మహిళలు, దివ్యాంగులు, వృద్ధులు, విముక్త బానిస కార్మికులు, పీవీటీజీ గిరిజనులు, ట్రాన్స్‌జెండర్ వ్యక్తులకు ప్రత్యేక గుర్తింపు కల్పించి ఉపాధి అవకాశాల్లో ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. సమాజంలోని అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని డ్వామా అధికారులు పేర్కొన్నారు. డిజిటల్ అటెండెన్స్, జీఐఎస్ మ్యాపింగ్, జియోట్యాగింగ్, డీబీటీ ద్వారా వేతనాల చెల్లింపు వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం ద్వారా పారదర్శకతను పెంపొందించనున్నట్లు తెలిపారు.




పథకం అమలు, నిధుల వినియోగం, మస్టర్ రోల్స్, వేతన చెల్లింపుల వివరాలు ప్రజలకు అందుబాటులో ఉంచడం ద్వారా జవాబుదారీతనాన్ని నిర్ధారించనున్నట్లు చెప్పారు. ఈ క్రమంలో పలు సాంకేతిక అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. గ్రామాభివృద్ధి ప్రణాళికల రూపకల్పన, నిధుల వినియోగం, ఉపాధి హామీ కార్యక్రమాల అమలు, సామాజిక తనిఖీలు, ప్రజా భాగస్వామ్యం, పారదర్శక పాలన, శాఖల మధ్య సమన్వయం వంటి అంశాలపై సవివరంగా వివరించారు. శిక్షణ సదస్సులో జెడ్పీ సీఈవో నారాయణమూర్తి, డిప్యూటీ సీఈవో రాజ్‌కుమార్, విజిలెన్స్ అధికారి, వివిధ శాఖల అధికారులు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, ప్రత్యేక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతీ ఇంటి ముందూ జాతీయ జెండా ఎగరాలి

**- 13 నుండి 15 వరకు హర్ ఘర్ తిరంగా**

**- 80వ స్వాతంత్ర్య దినోత్సవంలో దేశ భక్తి పెంపొందించాలి**

**- దేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలి**

**- జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్**

**విశాఖపట్నం, ఆగస్టు 11, జయ జయహే :**



ఆగస్టు 13 నుండి 15 వరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమం లో భాగంగా జిల్లాలోని ప్రతి ఇల్లు, వాణిజ్య సంస్థ మరియు ప్రభుత్వ కార్యాలయాలపై మూడు రోజుల పాటు జాతీయ జెండాను ఆవిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ పిలుపునిచ్చారు. పరిపాలనా యంత్రాంగం మరియు ప్రజాప్రతినిధులు పౌరులతో కలిసి ఈ వేడుకల్లో భాగస్వాములు కావాలని సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేళ దేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు" కావాలనీ, 80వ దేశ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "దేశ నిర్మాణంలో భాగస్వాములు" ... "అనే నేను" ప్రచార కార్యక్రమాన్ని ఆగస్టు 10 నుంచి 15 వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రజలు కేవలం ప్రేక్షకులుగా కాకుండా, ఈ దేశ నిర్మాణంలో తామూ భాగస్వాములమే అనే భావనతో స్వచ్ఛందంగా పాలుపంచుకునేలా ఈ ముందస్తు కార్యకలాపాలు ప్రభుత్వం రూపొందించిందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో మొక్కల నాటే కార్యక్రమం ఆగస్టు 14 న అటవీ మరియు ఉద్యానవన శాఖల సహకారంతో జిల్లా వ్యాప్తంగా ఒకే రోజు మెగా ప్లాంటేషన్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. ప్రజలు తమ ఇళ్ల వద్ద , ముఖ్య ప్రదేశాలలో మొక్కలు నాటి, జాతీయ జెండాను చేతబూని దేశ నిర్మాణానికి ప్రతిజ్ఞ చేయాలని కోరారు. ఆగస్టు 14 , 15 తేదీలలో ప్రభుత్వ భవనాలు, బస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లు మరియు ముఖ్యమైన కూడళ్లను జాతీయ రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించాలని సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేట్, ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులు ప్రత్యేక తరగతుల్లో తాము దేశ భవిష్యత్తు కోసం ఏం చేయగలమో వివరిస్తూ స్వయంగా ప్రతిజ్ఞలు చేయనున్నారని తెలిపారు.

# చికెన్ వింగ్స్.. ఇంట్లోనే సులువుగా చేసుకోవచ్చు



**చికెన్ వింగ్స్ పేరు చెబితేనే నోరూరిపోతుంది. దాన్ని తినాలంటే ప్రతిసారి రెస్టారెంట్ కి వెళ్లాల్సిన అవసరం లేదు. ఇంట్లోనే చాలా సులువుగా చేసుకోవచ్చు. కాస్త ఓపిక ఉంటే చాలు చికెన్ వింగ్స్ గంటలో రెడీ అయిపోతాయి. ఇవి ఇంట్లో ఉన్న పిల్లలకు, పెద్దలకు కూడా ఇది బాగా నచ్చుతాయి. ఎలా చేయాలో తెలుసుకోండి.**

**చికెన్ వింగ్స్ రెసిపీకే కావలసిన పదార్థాలు**

చికెన్ వింగ్స్ – అరకిలో
మైదాపిండి – అరకప్పు
కారం – ఒక స్పూను
మిరియాల పొడి – అర స్పూను
ఉల్లిపాయ పొడి – ఒక స్పూను
వెల్లుల్లి పొడి – ఒక స్పూను
నూనె – వేయించడానికి సరిపడా
ఉప్పు – రుచికి సరిపడా
బటర్ – రెండు స్పూన్లు
సోయాసాస్ – ఒక స్పూన్
బ్రౌన్ షుగర్ – మూడు స్పూన్లు
వెల్లుల్లి తురుము – ఒక స్పూను
అల్లం తురుము – ఒక స్పూను
తేనె – ఒక స్పూన్
పచ్చిమిర్చి – రెండు
ఎండుమిర్చి – రెండు
నువ్వులు – ఒక స్పూను
సోయాసాస్ – రెండు స్పూన్లు

**చికెన్ వింగ్స్ రెసిపీ**

చికెన్ వింగ్స్ ను తెచ్చి శుభ్రంగా కడిగి తడి లేకుండా టిష్యూ పేపర్ మీద ఆరబెట్టాలి.

ఒక గిన్నెలో మైదా, కారం, ఉప్పు, పచ్చిమిర్చి తరుగు, వెల్లుల్లి తరుగు, ఉల్లిపాయల పొడి వేసి బాగా కలిపి చికెన్ వింగ్స్ ను కూడా వేయాలి.

ఆ మిశ్రమం చికెన్ వింగ్స్‌కు బాగా పట్టేలా ఒక అరగంట పాటు పక్కన పెట్టేయాలి.

ఇప్పుడు స్టవ్ మీద కళాయి పెట్టి నూనె వేయాలి.

చికెన్ వింగ్స్ అందులో వేసి వేయించి తీసి టిష్యూ పేపర్ మీద వేసుకోవాలి.

ఇప్పుడు ఒక కళాయిని స్టవ్ మీద పెట్టి చిన్న మంట పెట్టాలి. 7. దానిలో బటర్ వేయాలి. ఆ బటర్ లో అల్లం వెల్లుల్లి తురుమును వేయాలి.

అలాగే సోయాసాస్, తేనే, బ్రౌన్ షుగర్ కూడా వేసి కలుపుకోవాలి.

సాస్ కొద్దిగా చిక్కగా అయ్యాక పెద్ద మంట పెట్టి ముందుగా వేయించి తీసుకున్న చికెన్ వింగ్స్ ను వేసి టాస్ చేసుకోవాలి.

చివర్లో ఎండుమిర్చి ముక్కలు, పచ్చిమిర్చి ముక్కలు వేసి కలుపుకోవాలి.

నువ్వులు గింజలను చల్లుకోవాలి. అంతే టేస్టీ చికెన్ వింగ్స్ రెడీ అయినట్టే. ఇది నోరూరించేలా ఉంటాయి.

ఇంట్లో పిల్లలకు పెద్దలకు అందరికీ నచ్చుతాయి

చికెన్ వింగ్స్ బయట ఎక్కువ రేటు ఉండే అవకాశం ఉంది. అదే ఇంట్లో చేసుకుంటే చాలా తక్కువ ధరకే ఇవి రెడీ అయిపోతాయి. ముందుగానే చికెన్ షాప్ వాడికి వింగ్స్ ను వేరుగా చేసి పెట్టమని ఆర్డర్ ఇచ్చుకోవాలి. లేదా ఆన్లైన్ చికెన్ మార్కెట్లలో కూడా చికెన్ వింగ్స్ సపరేట్ గా దొరుకుతున్నాయి. వాటిని కొనుక్కున్నా సరిపోతుంది. టేస్టీ చికెన్ వింగ్స్ వండేసుకోవచ్చు.

For a pure tomorrow.. జయహో

# వర్షంలో క్రిస్పీ, టేస్టీ పునుగులు

## 20 నిమిషాల్లో చేసుకోగలిగే సింపుల్ రెసిపీ



**వర్షం వస్తున్నప్పుడు కరకరలాడేలా, కాస్త స్పైసీగా, టేస్టీగా ఉండేలా తినాలనుకుంటే పునుగులు బెస్ట్ ఆప్షన్. వీటిని ఒక్కొక్కరు ఒక్కోలా చేస్తారు. అయితే ఇప్పుడు మీరు చూసే రెసిపీ కూడా మీకు మంచి టేస్ట్ అనుభవం ఇస్తుంది. చాలా సింపుల్‌గా ఈ పునుగులను చేసుకుని హాయిగా లాగించేయవచ్చు. ఇంతకీ ఈ టేస్టీ, క్రిస్పీ పునుగులను ఎలా తయారు చేయాలి? కావాల్సిన పదార్థాలు ఏమిటి? తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటి వంటి విషయాలు ఇప్పుడు తెలుసుకుందాం.**

### కావాల్సిన పదార్థాలు

పెరుగు - కప్పు
ఉప్పు - రుచికి తగినంత
బియ్యం పిండి -పావు కప్పు
ఉప్మా రవ్వ - అరకప్పు
మైదా పిండి - 1 కప్పు
వంటసోడా - చిటికెడు
నీళ్లు - తగినంత
జీలకర్ర - అర టీస్పూన్
కరివేపాకు - 1 రెబ్బ
కొత్తిమీర - 1 చిన్న కట్ట
పచ్చిమిర్చి - 4
ఉల్లిపాయలు - రెండు
నూనె - డీప్ ఫ్రైకి సరిపడినంత

### తయారీ విధానం

ముందుగా ఓ మిక్సింగ్ బౌల్ తీసుకోవాలి. దానిలో పెరుగు, ఉప్పు వేసి బాగా కలపాలి. పెరుగు గడ్డలుగా కాకుండా క్రీమీగా అయ్యేవరకు బాగా మిక్స్ చేసుకోవాలి. ఇలా చేసుకున్న దానిలో మైదాపిండి, బియ్యం పిండి, ఉప్మా రవ్వ, వంటసోడా వేసి బాగా కలుపుకోవాలి. ఉండలు లేకుండా కలపాలి. అవసరాన్ని బట్టి దానిలో కాస్త నీళ్లు వేసి.. పిండి మరీ వదులుగా కాకుండా చూసుకోవాలి. నీరు మరీ ఎక్కువైతే పిండి లూజ్ అవుతుంది. దీనివల్ల నూనె కూడా ఎక్కువ పీల్చుకుంటుంది.

ఇలా ఉండలు లేకుండా కలుపుకున్న పిండిని ఓ పదినిమిషాలు పక్కన పెట్టాలి. ఇప్పుడు ఉల్లిపాయలను, పచ్చిమిర్చిని చిన్న ముక్కలుగా కోసుకోవాలి. కరివేపాకు, కొత్తమీరను సన్నగా తురుముకోవాలి. పదినిమిషాల తర్వాత పిండిలో ఇవన్నీ వేసి కలుపుకోవాలి. ఉల్లిపాయల్లోని నీరు కూడా పిండికి కాస్త కలుస్తుంది. అందుకే నీరు వేసుకునే సమయంలో జాగ్రత్తగా ఉండాలి. అలాగే వంటసోడా వేయడం వల్ల పిండి కాస్త



పొంగుతుంది.

ఇప్పుడు స్టౌవ్ వెలిగించి దానిపై కడాయి పెట్టాలి. దానిలో డీప్ ఫ్రై చేసుకోవడానికి సరిపడేంత నూనె వేసి.. కాగనివ్వాలి. నూనె వేడి అయ్యాక మాత్రమే మనం పిండిని వేసుకోవాలి. నూనె వేడి అయిన తర్వాత పిండిని చేతితో తీసుకుని ఉండలుగా వేసుకోవాలి. పిండిని వేసే ముందు చేతిని కాస్త తడి చేస్తే పునుగులు గుండ్రంగా వస్తాయి. ఇలా వేసుకున్న పునుగులను రెండు వైపులా వేయించుకోవాలి. గోల్డెన్ బ్రౌన్ కలర్ వచ్చేవరకు వీటిని వేయించుకుని తీసేయాలి. అంతే వేడి వేడి క్రిస్పీ పునుగులు రెడీ.

ఈ పునుగులను మీరు ఎర్రకారంతో లేదా మీకు నచ్చిన చట్నీతో కలిపి లాగించవచ్చు. లేదంటే టీకి కాంబినేషన్‌గా కూడా ట్రై చేయవచ్చు. వర్షం వచ్చే సమయంలో వీటిని పిల్లలకు స్నాక్స్‌గా కూడా రెడీ చేసుకోవచ్చు. బ్యాచిలర్స్ కూడా వీటిని సింపుల్‌గా రూమ్‌లో వండుకోవచ్చు. ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌గా, సాయంత్రం స్నాక్‌గా తీసుకోవచ్చు. మరి ఇంకెందుకు ఆలస్యం ఈ వర్షం సమయంలో మీరు కూడా వీటిని ట్రై చేసేయండి.



# నోట్లో వేస్తే కరిగిపోయే స్పాంజ్ దోశ

## సింపుల్‌గా ఇలా ప్రిపేర్ చేసుకోండి

చాలా మంది ఎక్కువగా ఇష్టపడే బ్రేక్ ఫాస్ట్ ఐటమ్స్‌లలో ఒకటి.. దోశ. కానీ, ప్రతిసారీ క్రిస్పీ దోశలు తిని బోర్‌గా అనిపిస్తోందా? అయితే, ఈసారి వెరైటీగా 'స్పాంజ్ దోశ'ను ట్రై చేయండి. పోషక విలువలు పుష్కలంగా ఉన్న ఈ దోశ ఆరోగ్యానికీ ఎంతో మేలు చేస్తుంది! మరి, దీన్ని ఎలా ప్రిపేర్ చేసుకోవాలో ఇప్పుడు చూద్దాం.

మనందరికీ సాధారణంగా బ్రేక్‌ఫాస్ట్ అంటే ఇడ్లీ, పూరీ, బోండా, వడ, దోశ.. వంటివి గుర్తుకొస్తాయి. వీటిల్లో దోశలకు ఫ్యాన్ ఫాలోయింగ్ విపరీతంగా ఉంటుంది. అయితే, ప్రతిసారీ క్రిస్పీ దోశలను తిని బోరింగ్‌గా అనిపించొచ్చు. అందుకే ఈసారి మీకోసం ఒక సరికొత్త రెసిపీ తీసుకొచ్చాం. అదే.. "పోహ దోశ". దీనినే స్పాంజ్ దోశ అని కూడా అంటారు. ఈ రెసిపీ మహారాష్ట్ర, బెంగళూరులలో చాలా ఫేమస్. పైగా దీనికోసం ఎక్కువ పడాల్సిన పనిలేదు. చాలా సింపుల్‌గా తక్కువ సమయంలోనే ప్రిపేర్ చేసుకోవచ్చు. పైగా దీనిని తీసుకోవడం వల్ల శరీరానికి ఫైబర్, ఐరన్ లాంటి పోషకాలు అందుతాయి. మరి, ఈ సూపర్ హెల్దీ రెసిపీ కోసం కావాల్సిన పదార్థాలేంటి? ఎలా తయారుచేసుకోవాలి? అనే వివరాలు ఈ స్టోరీలో తెలుసుకుందాం.

**కావాల్సిన పదార్థాలు :**

రెండు కప్పులు - బియ్యం
అరకప్పు - పోహ
ఒక స్పూను - మెంతులు
రెండు కప్పులు - పెరుగు
రుచికి సరిపడా - నెయ్యి
రుచికి తగినంత - ఉప్పు

**పోహ దోశ తయారీ విధానం :**

ఇందుకోసం ముందుగా బియ్యం, మెంతులను శుభ్రంగా కడగాలి. ఇప్పుడు ఒక గిన్నెలో కొన్ని గోరువెచ్చని వాటర్ తీసుకొని అందులో వాటిని వేసి రెండు గంటల పాటు నానబెట్టుకోవాలి.

అలాగే మరో బౌల్‌లో అటుకులను కూడా బాగా కడిగి నానబెట్టుకోవాలి. రెండు గంటల తర్వాత బియ్యం, మెంతుల మిశ్రమాన్ని వడకట్టి మిక్సీ జార్‌లోకి వేసుకోవాలి. ఆపై కొద్దిగా వాటర్ యాడ్ చేసుకొని చిక్కటి పేస్ట్‌లా మిక్సీ పట్టుకోవాలి.

ఆవిధంగా పట్టుకునేటప్పుడు మధ్యలో నానబెట్టుకున్న అటుకులను కూడా యాడ్ చేసుకొని మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి.

ఆ తర్వాత ఆ మిశ్రమాన్ని మరో బౌల్ లోకి తీసుకొని.. పెరుగు, రుచికి సరిపడా ఉప్పు వేసుకొని బాగా కలిపి దోశ పిండిలా ప్రిపేర్ చేసుకోవాలి. అయితే, పిండి మరీ జారుడుగా కాకుండా కాస్త చిక్కగానే ఉండేట్లు చూసుకోవాలి.

ఇప్పుడు స్టౌపై దోశ పెనం పెట్టుకొని వేడి చేసుకోవాలి. అది కాస్త హీట్ అయ్యాక నెయ్యి అప్లై చేసుకొని కొద్దిగా పిండిని తీసుకొని మందపాటి దోశలా వేసుకోవాలి. ఎందుకంటే.. మరీ పలుచగా వేసుకుంటే క్రిస్పీలా వచ్చేస్తాయనే విషయాన్ని గుర్తుంచుకోవాలి.

కాబట్టి.. అట్టు మాదిరిగా దోశ వేసుకున్నాక దానిపై కొద్దిగా నెయ్యిని చల్లుకొని మీడియం సైజు మంటపై రెండువైపులా కాల్చుకోవాలి. అంతే.. ఎంతో టేస్టీగా, మెత్తగా మృదువుగా ఉండే "స్పాంజ్ దోశ" రెడీ!

ఈ దోశల్ని కొబ్బరి చట్నీ/పల్లీల చట్నీ, సాంబార్‌తో కలిపి తీసుకుంటే ఎంతో రుచిగా ఉంటాయి. మరి, ఇంకెందుకు ఆలస్యం మీరూ ఓసారి ఈ పోహ దోశను ట్రై చేయండి!


# గదుల్లో దాచిన స్పై కెమెరాలను గుర్తించాలంటే..

## ఈ సింపుల్ ట్రిక్స్ ఫాలో అవ్వండి

సమాజంలో చిన్నా పెద్దా, పేద ధనిక తేడాలేకుండాఅందర్నీ భయపెడుతున్న అంశం సీక్రెట్ కెమెరా. మనకు తెలియకుండానే ఇల్లు, ఆఫీసు, హొటల్ గదుల్లో రహస్యంగా కెమెరాలను అమర్చి బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు. షాపింగ్‌మాళ్లు, వస్త్ర దుకాణాల్లో ట్రయల్ రూమ్‌కి వెళ్లే ప్రతి మహిళ మదిలో మెదిలే సందేహం ఒక్కటే! గదిలో రహస్య కెమెరాలు ఉన్నాయోమోనని..! ఇలా అమర్చే కెమెరాలను కనుగొనేందుకు అనేక మార్గాలు ఉన్నాయి. ఈ సింపుల్ ట్రిక్ ఫాలో అయి రహస్య కెమెరా భారీ నుంచి మిమ్మల్ని మీరు కాపాడుకోండి.

అందుబాటులోకి వచ్చిన సాంకేతిక పరిజ్ఞానం ఎంత మేలు చేస్తుందో అది నిరుపయోగం అయితే అంతే ప్రమాదం కూడా. ఇటీవల కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాల అంశం వెలుగు చూసిన తర్వాత ప్రతిఒక్కరిలోనూ దీనిపై ఆందోళన నెలకొంది. గోప్యతకు ముప్పుగా మారింది. అయితే రహస్య కెమెరాలు ఎక్కువగా గోడ గడియారాలు, పవర్ బ్యాంక్‌లు, పిక్చర్ ఫ్రేమ్, అలంకరణ వస్తువులలో అమర్చుతున్నారు. ఈ రహస్య కెమెరాలను గుర్తించడం కొంచెం కష్టమవుతుంది.

ఆన్‌లైన్‌లో అతి తక్కువ ధరకు రహస్య కెమెరాలు లభిస్తుండటం వ్యక్తుల గోప్యత అనేది తీవ్రమైన ప్రమాదంలో పడింది. అయితే మీరేమీ భయపడాల్సిన అవసరం లేదు. ప్రస్తుతమున్న టెక్నాలజీని ఉపయోగించి.. ఇలాంటి రహస్య కెమెరాను చాలా సులువుగా గుర్తించవచ్చు. ముఖ్యంగా RF డిటెక్టర్లు, కెమెరా లెన్స్ డిటెక్టర్లు, థర్మల్ ఇమేజింగ్ కెమెరాలు, స్మార్ట్‌ఫోన్‌లు, Wi-Fi స్కానర్ల సహాయంతో రహస్య కెమెరాలను పసిగట్టొచ్చు. అంతే కాదు నేరుగా మన కళ్లతో చూసి కూడా రహస్య కెమెరాలను గుర్తించవచ్చు. అది ఎలాగో ఇప్పుడు తెలుసుకుందాం.



రహస్య కెమెరాలు చట్టవిరుద్ధమా: రహస్య కెమెరాల కొనుగోలు పూర్తిగా చట్టబద్ధమే అయినప్పటికీ, కొన్ని నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. సాధారణంగా ఇంట్లో, పరిసరాల్లో హిడెన్ కెమెరాలను అమర్చుకోవచ్చు. ఎలాంటి ఇబ్బంది లేదు. అయితే ఇంటిని మరొకరికి అద్దెకు ఇచ్చినప్పుడు, అతిథులు వచ్చినప్పుడు.. వారికి తెలియకుండా రహస్య కెమెరాలను అమర్చడం నేరం అవుతుంది. అలాగే ప్రభుత్వ సంస్థల వద్ద, రక్షణ ప్రాంతాల్లో మన వ్యక్తిగత రహస్య కెమెరాలు అమర్చడం చట్టవిరుద్ధమవుతుంది.

### రహస్య కెమెరాలను గుర్తించడం ఎలా?

1. నేరుగా కళ్లతో చూడడం: మనకు అనుమానం ఉన్న ప్రాంతంలో నిశితంగా గమనించాలి. గోడ గడియారాలు, పూల కుండీలు లాంటి పెద్ద ఆకృతిలో ఉండే వస్తువుల్లో అమర్చే కెమెరాలను జాగ్రత్తగా పరిశీలిస్తే గుర్తు పట్టేయొచ్చు. ఒక వేళ కంటికి కనిపించకపోతే, లేటెస్ట్ టెక్నాలజీ ద్వారా ఆ స్పై కెమెరాలను గుర్తించవచ్చు

2. రేడియో ఫ్రీక్వెన్సీ డిటెక్టర్లు: కంటికి కనిపించని కెమెరాలను గుర్తించడానికి RF డిటెక్టర్ ఉపయోగపడుతుంది. స్పై కెమెరాల నుంచి తరచుగా వెలువడే రేడియో తరంగాలను గ్రహించడం ద్వారా RF టిటెక్టర్ వాటిని గుర్తిస్తుంది. చాలా కెమెరాలు 500MHz నుంచి 6GHz వరకు రేడియో తరంగాలను ప్రసారం చేస్తాయి. స్కాన్ చేయడం ద్వారా డిటెక్టర్లు ఈ హిడెన్ కెమెరాలను పసిగడతాయి.

3. కెమెరా లెన్స్ డిటెక్టర్లు: కొన్ని రహస్య కెమెరాలు తమ ఫీడ్‌ను SD%కార్డ్స్ లాంటి లోకల్ స్టోరేజ్‌ల్లో నిక్షిప్తం చేస్తుంటాయి. ఈ పరికరాలకు రేడియో సిగ్నల్స్ అవసరం లేదు. అయితే ఇలాంటి కెమెరాలను కూడా కెమెరా లెన్స్ డిటెక్టర్లతో గుర్తించవచ్చు. కెమెరా లెన్స్ సాధారణంగా కాంతి ప్రతిబింబాలను క్యాప్చర్ చేస్తుంటాయి. ఇలా చేస్తున్న సమయంలో సెన్సార్ ఆఫ్ అయినట్లయితే, సదరు ప్రాంతంలో రహస్య కెమెరాలు ఉన్నాయని అనుమానించవచ్చు. అప్పుడు నేరుగా సదరు ప్రాంతంలో చెక్ చేసి, రహస్య కెమెరాలు ఉన్నాయో, లేదో చెక్ చేసుకోవాలి. అంతే సింపుల్

4. థర్మల్ ఇమేజింగ్ కెమెరాలు: సాధారణంగా ఎలక్ట్రానిక్ వస్తువులను ఉపయోగిస్తూ ఉంటే.. అవి వేడెక్కుతాయి. కనుక థర్మల్ ఇమేజింగ్ కెమెరాలను ఉపయోగించి, రహస్య కెమెరాలను గుర్తించవచ్చు. ఉదాహరణకు ల్యాప్‌టాప్‌లను, ఫోన్లను ఎక్కువసేపు ఉపయోగిస్తే వేడెక్కుతాయి. అందువల్ల థర్మల్ ఇమేజింగ్ కెమెరాలు ఉపయోగించి రహస్య కెమెరాల "గుట్టు రట్టు" చేయవచ్చు.

5. స్మార్ట్ ఫోన్: రహస్య కెమెరాలను కనుగొనేందుకు స్మార్ట్‌ఫోన్లు చక్కగా ఉపయోగపడతాయి. రకరకాల యాప్‌ల సహాయంతో రహస్య కెమెరాలను గుర్తించొచ్చు. చీకటిలో రికార్డ్ చేయడానికి కెమెరా లెన్స్‌లకు కొంత ప్రకాశవంతమైన ఫీచర్లు అవసరం. చాలా మంది తయారీదారులు ఇన్‌ఫ్రారెడ్ (%×=%) సాంకేతికత వాడుతుంటారు. ఇది కంటికి కనిపించదు. కనుక మీరు మీ ఫోన్లోని ఫ్రంట్ కెమెరాను ఆన్‌చేసి, చీకటిలో మీ గది మొత్తాన్ని చూడండి. సాధారణ కంటికి కనిపించని, ఏదైనా వెలుగు ఫోన్ కెమెరాలో కనిపిస్తే వెంటనే అది హిడెన్ కెమెరా అని గుర్తించండి.

6. Wi-Fi స్కానర్

మన స్మార్ట్ ఫోన్ ద్వారా వై-ఫై నెట్‌వర్క్‌లను సులువుగా గుర్తించవచ్చు. కనుక దీని ద్వారా మీ ఇంట్లో వై-ఫైతో రన్ అవుతున్న రహస్య కెమెరాలను సులువుగా గుర్తించవచ్చు. అంతేకాదు హ్యాండ్‌హెల్డ్ Wi-Fi, నెట్‌వర్క్ స్కానర్‌ల ద్వారా కూడా రహస్య కెమెరాలను గుర్తించొచ్చు.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com